
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 11 డిసెంబరు 2024

డ్రైవింగ్ ట్రాక్..
ఇక అంతా ఆటోమేటిక్కే!

తప్పులు గుర్తించనున్న సెన్సార్లు, కెమెరాలు

పరీక్షలో పొరపాటు చేస్తే ఫొటోలతో రుజువు

వేగంగా అధునాతన పనులు

నెల రోజుల్లో అందుబాటులోకి..



డ్రైవింగ్ ట్రాక్ వద్ద డిజిటల్ ట్రాక్ స్తంభాల ఏర్పాటు

డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారా!? అయితే నిబంధనల ప్రకారం డ్రైవింగ్ నేర్చుకోండి. గతంలోలా డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరైన సమయంలో ట్రాక్ మధ్యలోని మలుపులో కాలు కింద పెట్టడం, 8వ రౌండ్ వేసే సమయంలో లెఫ్ట్, రైట్ సిగ్నల్స్ తప్పుగా వేయడం, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో వాహనం ఇంజన్ ఆగిపోవడం... వంటి తప్పులు జరిగాయా? ఇక అంతే.. మీరు తప్పనిసరిగా ఫెయిలే. ఎందుకు ఫెయిల్ అయ్యామా.. అని వాదించడానికి కూడా వీల్లేకుండా పక్కాగా మీరు చేసిన తప్పును ఫొటో తీసి చూపుతుంది అడ్వాన్సుడ్ డ్రైవింగ్ ట్రాక్. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా, తప్పులు చేస్తూ ఉంటే అన్నిసార్లు కూడా డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్ అవుతూనే ఉంటారు.

- వివరాలు 6లో

అసంపూర్తి చేయరా!?

- 167బి జాతీయ రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఏడాదిగా ఆగిన కల్వర్టులు, వంతెనలు, కూడళ్ల నిర్మాణాలు
- ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- కందుకూరు బైపాస్ నిర్మాణంలోనూ ఇదే తీరు



బడేవారిపాలెం సమీపంలో అప్రోచ్‌లు కలపకుండా వదిలేసిన దృశ్యం

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి (నెం.16) అనుసంధానంగా సింగరాయకొండ (ప్రకాశం జిల్లా) నుంచి పోరుమామిళ్ల (వైఎస్సార్ జిల్లా) వరకు నిర్మిస్తున్న 167బీ జాతీయ రహదారి నిర్మాణంలో మితిమీరిన జాప్యం జరుగుతోంది. రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన వంతెనలు, కల్వర్టులు, కూడళ్ల వద్ద సంవత్సరాల తరబడి నిర్మాణాలను అసంపూర్తి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసిన కాంట్రాక్టరు వంతెనలు, కల్వర్టులు, కూడళ్ల వద్ద కనీసం సరైన ఇండికేటర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- వివరాలు 6లో

4 నెలల్లో ఫిషింగ్ హార్బర్‌ను
వినియోగంలోకి తెండి!

- సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మిగిలి ఉన్న నిర్మాణాలన్నీ రానున్న నాలుగు నెల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఫిషింగ్ హార్బర్ జిల్లాస్థాయి సలహా కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పడవల యాజమాన్య సంఘాలు, ఫిష్ మార్కెటింగ్ సంఘాలు, వారి ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. హార్బర్‌లో సౌకర్యాలను, యాంత్రిక పడవలు వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోర్టు అధికారులను ఆదేశించారు. బోట్ల ద్వారా సేకరించిన మత్స్య సంపద క్రయ, విక్రయాలు జరుపుకునేందుకు ఎగుమతిదారులను ఆహ్వానించి తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపెడా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హార్బర్‌లో ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, అసంపూర్తి నిర్మాణాలు, సౌకర్యాలతోపాటు హార్బర్ నిర్వహణకు వసూలు చేయాల్సిన బెర్తింగ్ చార్జీలు, గోదాముల అద్దె, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు హార్బర్ నిర్వహణ కమిటీల ఏర్పాటు వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పోర్టు అధికారి ధర్మశాస్త్రి, ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సజీత్‌కుమార్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎంపెడా ప్రతినిధి మురళీమోహన్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వీవీఆర్.బాబు, మెరైన్ ఎస్సై నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

ఆరు నెలల్లో
67 కొత్త బస్సులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు కొత్త బస్సులు వస్తూనే ఉన్నాయి. గడిచిన ఆరునెలల వ్యవధిలో 67 కొత్త బస్సులు జిల్లాకు చేరాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు బస్సులు మాత్రమే రీజియన్‌కు కూటమి ప్రభుత్వం ఆరంభంలోనే కొత్త బస్సులను కేటాయించి కాలం చెల్లిన వాటిని పక్కన పెట్టారు. ఆత్మకూరు డిపోకు ఒక సూపర్ లగ్జరీ బస్సు, కందుకూరు డిపోకు 9 సూపర్ లగ్జరీలు, రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను కేటాయించారు. కావలి డిపోకు ఒక సూపర్ లగ్జరీ, నెల్లూరు ఒకటవ డిపోకు 26 సూపర్ లగ్జరీ బస్సులు, మూడు అల్ట్రా డీలక్స్‌లు, నెల్లూరు రెండో డిపోకు 4 సూపర్ లగ్జరీలు, 4 అల్ట్రా డీలక్స్‌లు, మూడు ఎక్స్‌ప్రెస్‌లు, రాపూరు డిపోకు ఒక సూపర్ లగ్జరీ, ఉదయగిరి డిపోకు 7 సూపర్ లగ్జరీలు, ఆరు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కేటాయించారు. ప్రస్తుతం ఇవన్నీ ఆయా మార్గాలలో నడుస్తున్నాయి.



లక్ష్యం ఉన్నతం..
ఫలితం శూన్యం!

పొదలకూరు మండలంలో ఇప్పటివరకు రెండు రెవెన్యూ సదస్సులు జరిగాయి. విరువూరులో జరిగిన సదస్సులో కేవలం ఒక అర్జీ మాత్రమే వచ్చింది. మంగళవారం తాటిపర్తిలో జరిగిన సదస్సులో మూడు అర్జీలు మాత్రమే అధికారులకు అందాయి.

నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులు పాల్గొనలేదు. కోర్టు వాయిదా ఉందని తహసీల్దారు వెళ్లిపోగా, ప్రత్యేక అధికారి గైర్హాజరు అయ్యారు. దీంతో డీటీ, వీఆర్వోలే మొక్కుబడిగా సదస్సు నిర్వహించారు.

భూ సమస్యలు అధికంగా పెరిగిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలన్న ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రారంభించింది. రెవెన్యూ యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లేలా ఉన్నత లక్ష్యంతో మొదలైన సదస్సులు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. సదస్సుల నిర్వహణపై ముందస్తు సమాచారం లేకపోవడంతో చాలా మంది రావడం లేదు. అలాగే తమ సమస్యలు చెప్పుకునేందుకు బాధితులు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ అర్జీలు ఇచ్చినా పరిష్కారం దొరకదన్న అపనమ్మకం వారిలో నెలకొన్నట్లు వస్తున్న అర్జీల సంఖ్యను బట్టి అర్థమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- ఆశించిన స్థాయిలో జరగని రెవెన్యూ సదస్సులు
- అర్జీలు ఇచ్చేందుకు ఆసక్తి చూపని భూ బాధితులు
- ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకే మొగ్గు
- ముందుగా ప్రచారం చేయడంలో విఫలం
- కొన్నిచోట్ల డుమ్మా కొడుతున్న అధికారులు



చిట్టగుంట : బోగోలు పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో తన భూమికి సంబంధించి రికార్డులో తన పేరు గల్లంతు అయ్యిందని తహసీల్దారు సురేష్‌బాబును ప్రశ్నిస్తున్న మహిళ

జిల్లాను భూ సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఆక్రమణలు, రికార్డుల మార్పులు చేయడమే కాకుండా రీసర్వే కూడా తప్పుల తడకగా మారడంతో ఊహించని విధంగా భూ సమస్యలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చి పడుతున్నాయి. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో వస్తున్న అర్జీలు సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత సీరియస్‌గా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. ఆయన కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడమే కాకుండా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకూ ప్రతి గ్రామం, వార్డులో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. ఇందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారి, జిల్లాకు ఓ ఐఏఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించింది.

● ప్రజల్లో కనిపించని స్పందన

రెవెన్యూ సదస్సులకు ఆయా గ్రామ వీఆర్వో మొదలు తహసీల్దార్ వరకూ ప్రతి ఒక్కరూ హాజరు కావాలి. ప్రతి రెవెన్యూ రికార్డులను దగ్గర ఉంచుకోవాలి. వచ్చే అర్జీలను బట్టి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలి. కానీ ఈ పరిస్థితి చాలా చోట్ల కనిపించడం లేదు. కొన్ని చోట్ల తహసీల్దార్లు కూడా హాజరు కావడం లేదు. ఇక ప్రత్యేకాధికారుల జాడ కనిపించడం లేదు. మంత్రులు లేదా ఎమ్మెల్యేలు వస్తుంటే వీరు కనిపిస్తున్నారు. దీంతో కిందిస్థాయి సిబ్బందే సదస్సులను తూతూమంత్రంగా ముగిస్తున్నారు. కొన్నిచోట్ల ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో సదస్సుల్లో అర్జీలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఈ నెల 9వ తేదీ నాటికి రెవెన్యూ సదస్సుల్లో 459 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గత సోమవారం నాడు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 256 అర్జీలు వస్తే అందులో 130 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం.



జలదంకి : బీకే అగ్రహారంలో జరిగిన సదస్సులో తక్కువగా హాజరైన ప్రజలు

● ఉన్నతాధికారులకు ఇచ్చేందుకే మొగ్గు

అటు రెవెన్యూ సదస్సుల్లో గానీ ఇటు కలెక్టర్ గ్రీవెన్స్‌లో గానీ వస్తున్న భూ సమస్యల్లో ఆర్‌వోఆర్ (రైట్స్ ఆఫ్ రికార్డ్స్)కు చెందినవే ఎక్కువగా ఉన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో అలాంటి 245 అర్జీలు రాగా, అసైన్డ్ భూములకు సంబంధించి 92, భూ సరిహద్దులకు సంబంధించి 41 అర్జీలు అందాయి. అయితే అర్జీదారులు మండల స్థాయి అధికారులకు సమస్యలు చెప్పుకునేందుకు ఇష్టపడడం లేదు. వారికి చెప్పినా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వీరిలో ఎక్కువగా ఉంటోంది. దీంతో దూరమైనా జిల్లా కేంద్రానికి వచ్చేందుకే ఆసక్తి చూపుతున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో మండల స్థాయిలోనే ఇష్టానుసారం అక్రమాలు జరిగాయి. భూ బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు మొగ్గు చూపుతుండటంలో ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. మండల స్థాయిలో అర్జీలు ఇచ్చినా పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

అమరావతి వెళ్లిన కలెక్టర్ ఆనంద్ ● ప్రధాన శాఖలపై సీఎం సమీక్ష

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం బుధవారం అమరావతిలో జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు కలెక్టర్ ఓ ఆనంద్ బయలుదేరి వెళ్లారు. బుధ, గురువారాల్లో ఈ సదస్సు జరగనుంది. ప్రధాన శాఖలపై సీఎం సమీక్షించనున్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిపై చర్చించనున్నారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర-2047పై సదస్సు జరగనుంది. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతీ జిల్లాకు ఒక విజన్ ప్లాన్ రూపొందించాలని గత కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల సలహాలు, సూచనలు తీసుకున్న అధికార యంత్రాంగం స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌ను ప్రభుత్వానికి అందించింది. దాని ప్రకారం ఎలా ముందుకెళ్లాలన్నదానిపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.12.23 లక్షల కోట్లుకాగా అందులో నెల్లూరు జిల్లా వాటా రూ.57,887 కోట్లుగా ఉంది. రాష్ట్రంలో జిల్లా ఏడవ స్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంలో రూ.22,505 కోట్లతో ఐదవ స్థానంలో ఉండగా, పారిశ్రామిక రంగంలో 11,699 కోట్ల జీవీఏతో 11వ స్థానంలో, సేవా రంగంలో 23,683 కోట్లతో ఆరవ స్థానంలో ఉంది. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా జిల్లా స్థూల ఉత్పత్తిని 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.1.38 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ ఏడాది 15 శాతం వృద్ధి సాధించేలా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా గోదావరి-పెన్నా నదుల అనుసంధానం అంశంపై కూడా కలెక్టర్ల సదస్సులో సమీక్షించేలా షెడ్యూల్ నిర్ణయించారు. రూ.6020 కోట్ల అంచనాతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును 2026 జూన్‌లోపు పూర్తి చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు
నేడు నోటిఫికేషన్

- 14న డబ్ల్యూఏలకు పోలింగ్ ● 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక
- ఏకగ్రీవం చేసుకునేందుకు అధికార పార్టీ వ్యూహం

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే హద్దుల ఖరారు, ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఇక మిగిలిన పోలింగ్ ప్రక్రియకు బుధవారం నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 765 సాగునీటి సంఘాలు (డబ్ల్యూఏ), 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీలు), ఐదు ప్రాజెక్టు కమిటీలు (పీసీలు) ఉన్నాయి. తొలుత డబ్ల్యూఏలకు నోటిఫికేషన్ ఇస్తారు. పోలింగ్ ఏ వేదికలో జరుగుతుందన్న సమాచారాన్ని ఎన్నికల అధికారులు ఆయా గ్రామాల్లో దండోరా వేయిస్తారు. 14వ తేదీన డబ్ల్యూఏలకు సంబంధించి సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను స్థానిక రైతులు ఎన్నుకుంటారు. ఇక అదే రోజున డీసీలకు సంబంధించి ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ ఇస్తారు. ఎప్పుడు, ఎక్కడ.. ఎన్నిక నిర్వహించేదన్న సమాచారాన్ని డబ్ల్యూఏ అధ్యక్షులకు తెలియజేస్తారు. వీరంతా కలిసి 17వ తేదీన డీసీ పాలకవర్గాలను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీ పాలకవర్గాల ఎన్నిక జరుగుతుంది. అయితే ఇది ఏ తేదీన నిర్వహిస్తారన్నది ఇంకా ఖరారు చేయలేదు. కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపిస్తుంటాయి. పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. చాలా వరకూ ఏకగ్రీవం చేయాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే రైతులంతా ఎవరిని ఎన్నుకోవాలన్నదానిపై ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే కొన్ని గ్రామాల్లో పోటీ తప్పేలా కనిపించడం లేదు. ప్రతిపక్ష పార్టీల నేతలు తమ అనుమాయులను పోటీకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



ప్రీక్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు

వైభవంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్సీ మైదానంలో మంగళవారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రైస్తవ కూటమి సభ్యులు వందలాదిగా తరలివచ్చారు. సింహపురి ఐక్య క్రిస్మస్ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్‌కుమార్ లైవ్ ద్వారా ప్రసంగించారు. ఆయన ప్రసంగం క్రైస్తవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. లైవ్ వర్షిప్ నైట్, కేక్ కటింగ్, క్రిస్మస్ ట్రీ ఆవిష్కరణ జరిగాయి. ఈ వేడుకల్లో నెల్లూరు బిషప్ ఎండీ ప్రకాశం, సింహపురి ఐక్యవేదిక వ్యవస్థాపకుడు బర్నబాసు, నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్, క్రైస్తవ నాయకులు ఊరందూరు సురేంద్రబాబు, సాల్వేషన్ ఆర్మీ మేజర్ యేసురాజ్యం, పాస్టర్‌వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గడ్డం హనోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

అందరూ ఆరు పదులు దాటిన వయస్కులే. కానీ వృద్ధాప్యం వయసుకే కానీ శరీరానికి కాదని నిరూపించారు. ఆటల్లో మేటిగా రాణించి తమ సత్తా ఏమిటో చాటారు. మంగళవారం కావలి స్టేడియం మైదానంలో తాలూకా పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆ సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో పురుషులు, మహిళలు పాల్గొని తమ వయసును సైతం పక్కన పెట్టి యువకులులా కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, త్రోబాల్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడా విభాగాల్లో పోటీలు జరిగాయి. 'నేను గెలిచాను కాదు.. నేనే గెలిచా'నంటూ వాదనలు కేరింతలు.. ఆ తర్వాత 'నువ్వే గెలిచావులే'నంటూ సమర్థనలతో ఒకరినొకరు అభినందించుకోవడం ఆత్మీయ ఆలింగనాలతో మైదానంలో సందడి నెలకొంది. పెన్షనర్ల దినోత్సవం (17న) రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని సంఘం అధ్యక్షుడు రమణయ్య తెలిపారు. జేబీ విశ్రాంత పీడీ ఇంటర్నేషనల్ వెటరన్ క్రీడాకారిణి కోటేశ్వరమ్మ న్యాయనిర్ణేతగా వ్యవహరించగా పీఈటీ రాజ్యలక్ష్మి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఆదిశేషులు, అసోసియేట్ ప్రెసిడెంట్ పి రవికుమార్ కోశాధికారి ఏపూరు వెంకయ్య పాల్గొన్నారు.

- కావలి (టౌన్), (ఆంధ్రజ్యోతి)



యాహూ.. నేను చాలా దూరం విసిరా..!

నెల్లూరు నగరంలో
స్మార్టు స్ట్రీట్ బజార్

- త్వరలో ఏర్పాటుకు సన్నాహాలు : కమిషనర్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన ఆర్థిక భరోసా కల్పించేందుకు స్మార్టు స్ట్రీట్ బజారును నెల్లూరులో ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ వెల్లడించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు నగరంలో 200 దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కదిలే కంటైనర్‌లో వీటిని ఏర్పాటు చేస్తామని, ఒక్కో కంటైనర్‌లో నాలుగు షాపుల నిర్మాణం, సోలార్ విద్యుత్ కనెక్షన్ ఉంటుందని చెప్పారు. పార్కింగ్ సౌకర్యం ప్రథమంగా తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంచినీరు, మరుగుదొడ్లు, వీధిదీపాలు, ఉచిత వైఫై, సెల్ఫీ పాయింట్లు, అక్కడే తినుబండారాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కంటైనర్‌లో షాపులు పొందే చిరు వ్యాపారులకు మెప్మా నుంచి రూ.2 లక్షల రుణం కూడా అందచేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏడీసీ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, ఎస్ఈ రామ్మోహన్‌రావు, టీపీఆర్వో బాలకృష్ణ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.



'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 4,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మంగళవారం 2,988 క్యూసెక్కులకు చేరింది. డ్యాంలో 72.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువ 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు'లో 55.5 టీఎంసీలు

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 55.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు ఉండగా, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 1,795 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు పేర్కొన్నారు.

16వ నెంబరు జాతీయ రహదారి సమీపంలోని గుడ్లూరు మండలం రావూరుకు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఇది. రైల్వే లెవల్ క్రాసింగ్‌లు ప్రమాదాలకు కారణమవుతుందని ఇటీవల ఆఘమేఘాల మీద రూ.2కోట్లు వెచ్చించి ఈ అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు అండర్ పాస్ నిండా వర్షపు నీరు నిలిచింది. దీని నిర్మాణానికి ముందు రైలు వచ్చే సమయంలో గేటు వేస్తే పది నిమిషాలు ఆగి వెళ్లేవా రమని, ఇటీవల ఇంజనీరింగ్ అధికారుల డిజైన్ చేసి నిర్మించిన పుణ్యమా అని 6కిలో మీటర్లు దూరం వెళ్లి పొలాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొందని చుట్టుప క్కల మాగాణి భూములున్న రైతులు వాపోతున్నారు. అండర్ పాస్ నుంచి వెళ్లొద్దని స్టాప్ బోర్డు చేయడం విడ్డూ రంగా ఉందని వాహనదారులు నవ్వు కుంటున్నారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)



రావూరుకు వెళ్లే రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలో నీరు చేరటంతో పెట్టిన స్టాప్ బోర్డు

నవ్విపోదురుగాక.. ఇంజనీర్లకేం సిగ్గు..!


రావూరు రైల్వే అండర్‌పాస్‌లో 8 అడుగుల లోతున నిలిచిన నీరు

రోడ్డు మార్జిన్‌కు మరమ్మతులు

పట్టణంలోని నాగులబావి వీధిలో ఇటీవల కోతకు గురైన సిమెంట్‌రోడ్డు మార్జిన్, గుంతలకు మంగళవారం పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'ఆదమరిస్తే అంతేసంగతులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ ఈవో షేక్ కరీముల్లా మార్జిన్, గుంతల్లో మట్టి తోలి చదును చేయించి, వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)



గేటు తీయాలంటే బాహుబలి రావాలా!

- విరిగిపడిన తూము గేటు
- కొనసాగుతున్న మరమ్మతులు
- త్వరగా నీరివ్వాలని తరలివచ్చిన రైతులు

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము మొదటి గేటు మరమ్మతులు మంగళవారం కూడా కొనసాగాయి. ఉదయం నరసారావుపేటకు చెందిన మెకానిక్ నిపుణులు షేక్ షమీం బాషా, ఆయన సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది తూము గేటును పైకి లాగే పనులను ప్రారంభించారు. అయితే ఇద్దరు వ్యక్తులు తూము లోపలికి వెళ్లి విరిగిపడ్డ గేటు కింది భాగంలో ఇనుప తాడు కట్టి పైకి లాగేందుకు ప్రయత్నించినా ఒక్క అంగుళం కూడా కదలలేదు. పదే పదే ప్రయత్నించి గేటు రాక పోవడంతో, బాషా బీమ్‌ను ఏర్పాటు చేయించారు. అలాగే మరో ఇనుప తాడు, మరికొన్ని పరికరాలను కందుకూరు నుంచి తెప్పించి సాయంత్రం నాలుగు గంటలకు పనులు చేశారు. రాత్రి కూడా ఈ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ, రాత్రికి గానీ బుధవారం మధ్యాహ్నం లోపు గేటును బయటకు లాగేస్తామన్నారు.


కాలువ తూము వద్ద గేటును పైకి లాగేందుకు యత్నిస్తున్న మెకానిక్ షమీం బాషా, అధికారులు, సిబ్బంది

• రైతుల ఆందోళన

ప్రాజెక్టు కుడి కాలువ తూము నాలుగురోజులుగా తమ పొలాలకు నీరు విడుదల కాకా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలు ఎండిపోతున్నాయని త్వరగా నీరివ్వాలని ఉదయం నుండి సాయంత్రం వరకు అనేక మంది ప్రాజెక్టు వద్దకు తరలి వచ్చి నిరీక్షించారు. చాలా మంది రైతులు కూడా గేటును పైకి లేపేందుకు అధికారులకు కూడా సాయపడ్డారు. గేటు రాకపోవడంతో నిరాశగా సాయంత్రం 6గంటలకు ఇళ్లకు తిరిగివెళ్లారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రాజెక్టు నిర్వహణకు, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింప జేసి, అధికారులను, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


డ్యాం వద్ద కూర్చొని ఉన్న రైతులు

డ్రైవింగ్ ట్రాక్.. ఇక అంతా ఆటోమేటికే!

- తప్పులు గుర్తించనున్న సెన్సార్లు, కెమెరాలు
- పరీక్షలో పొరపాటు చేస్తే ఫొటోలతో రుజువు
- వేగంగా అధునాతన పనులు
- నెల రోజుల్లో అందుబాటులోకి

నెల్లూరు (క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మొదటివిడతలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడలో అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండో విడతలో నెల్లూరులోని ఆర్టీవో కార్యాలయంలో ట్రాక్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన ఆర్ఎఫ్ఐడీ కెమెరాలు, సెన్సార్లు, స్తంభాలు, ఇతర సామగ్రి జిల్లాకు చేరాయి. నెలలో పనులు పూర్తికానున్నాయి. ఆ తర్వాత అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌పై ట్రయల్ వేయాల్సి ఉంటుంది.

• పోల్స్‌పై కెమెరాలు

అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్సుడ్ డ్రైవింగ్ ట్రాక్‌లో పోల్స్‌పై కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ట్రాక్ కింద సెన్సార్లు అమరుస్తారు. సెన్సార్లలో డ్రైవింగ్ టెస్ట్‌కు సంబంధించిన పారా మీటర్స్ పొందుపరుస్తారు. ఈ క్రమంలో సెన్సార్లు ట్రాక్‌పై రూట్ మ్యాప్ ప్రకారం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతున్నారా.. లేదా? అని చూస్తుం టాయి. ఇక పోల్స్‌పై ఉన్న కెమెరాలు ఎక్కడెక్కడ తప్పు చేశారో ఫొటోలు తీస్తాయి. ఇలా డ్రైవింగ్ టెస్ట్ పూర్తయ్యేసరికి హాజరైనవారు ఎక్కడెక్కడ ఎన్నెన్ని తప్పులు చేశారోనని ఫొటోలతో వారికి చూపించి ఎందుకు ఫెయిల్ అయ్యారో.. కూడా చూపుతుంది. నిబంధనల మేరకు డ్రైవింగ్ టెస్ట్ పాస్ అయితే థమ్ వేయించుకొని పంపుతారు. ఈ ట్రాక్ అందుబాటులోకి వస్తే అధికారులు చేసేదేమి ఉండదు. చిత్తూరులో అందు బాటులోకి వచ్చిన అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్‌లో డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరైన వారిలో ఫెయిల్ అయ్యే వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. కాబట్టి వాహన దారులు ఇక నుంచి జాగ్రత్తగా నడుచుకోవాలి.


కార్యాలయానికి వచ్చిన డిజిటల్ ట్రాక్ స్తంభాలను పరిశీలిస్తున్న ఆర్టీవో అధికారులు



నెలలో అందుబాటులోకి..

అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తవుతాయి. సెన్సార్ల ద్వారా డ్రైవింగ్ టెస్ట్ ఫలితాలు వెలువడుతాయేతప్ప అధికారులు, సిబ్బంది చేసేదేమీ ఉండదు.

- డీ చందర్, డీటీసీ

మరుగుదొడ్ల వినియోగం ఆరోగ్యవంతం

• జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవంతోపాటు ఆరోగ్యవంతమైన జీవితాలకు ఆధారమవుతుందని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ బహిర్భూమికి ఎవరూ వెళ్లకూడదనే లక్ష్యంతో ఉండాలన్నారు. సామాజిక మరుగుదొడ్లను కేవలం నిర్మించడంతోనే సరిపోదని, వాటిని సక్రమంగా ఉపయోగిస్తేనే లక్ష్యం నేరవేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ మరుగుదొడ్ల లబ్ధిదారుల కు, ఉత్తమ సామాజిక శానిటరీ కాంప్లెక్స్‌లకు పురస్కారాలు అందజేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కారుడ్రైవర్ కళ్లలో కారం కొట్టి దాడిచేసిన వ్యక్తులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మూలాపేట కోనేటిమిట్టకు చెందిన మురళీ కారు డ్రైవర్. సోమవారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్క్ వేసుకుని అతని ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో మురళీ ఇంట్లో లేకపోవడంతో అతని నెంబర్ సేకరించి కావలికి వెళ్లేందుకు కారు కావాలని కోరారు. అయితే అతను తన వద్ద కారు లేదని చెప్పడంతో వేరే వ్యక్తులను సంప్రదించి ఫేత్తేఖాన్‌పేటలో ఉన్న మురళీ వద్దకు వచ్చారు. కారు బాడుగ విషయమై మాట్లాడుతూ ఆకస్మాత్తుగా మురళీ కళ్లలో కారం కొట్టి రాయితో దాడిచేసి పరారయ్యారు. బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ పథకం ప్రకారమే దాడి జరిగినట్లు పోలీసులు భావించి ఆ దిశగా విచారిస్తున్నారు.

కారు అద్దాలు పగులగొట్టి దోపిడీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నిలిపి ఉన్న కారు అద్దాలు పగులగొట్టి అందులో ఉన్న నగదు బ్యాగులను అపహరిం చుకొని వెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కేసులు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొగతోట నాల్గో వీధిలో సత్యనారాయణ కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమారుడు రాహుల్‌బాబు ఈఎన్‌టీ వైద్యుడు. సత్యనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెంచలయ్య వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సత్యనారాయణ కుమారుడు, కోడలితో కలిసి కారులో పెంచలయ్య వైద్యశాలకు వెళ్లారు. అక్కడ వీరి కారు డోర్ అద్దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న హ్యాండ్ బ్యాగును దోచుకెళ్లారు. చికిత్స అనంతరం బాధితులు కారు వద్దకు వచ్చి చూడగా అద్దం పగలగొట్టి ఉంది. హ్యాండ్‌బ్యాగ్ కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. చోరీకి గురైన హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.60 నగదు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నాయని రాహుల్‌బాబు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నర్తకి సెంటర్ సమీపంలోనూ

నగరానికి చెందిన హర్ష సోమవారం రాత్రి పని నిమిత్తం నర్తకి సెంటర్‌కు వచ్చారు. సెంటర్‌లో తన కారును పార్క్ చేసి సమీపంలోని దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగులు కారు అద్దాన్ని పగులగొట్టి అందులో ఉన్న బ్యాగ్‌ను అపహరించుకుని వెళ్లారు. పని ముగియడంతో కారు వద్దకు చేరుకున్న వర్ష అద్దం పగులగొట్టి ఉండటం, కారులోని బ్యాగ్ కనిపించకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

అసంపూర్తి చేయరా!?

- 167జి జాతీయ రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఏడాదిగా ఆగిన కల్వర్టులు, వంతెనలు, కూడళ్ల నిర్మాణాలు
- ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- కందుకూరు బైపాస్ నిర్మాణంలోనూ ఇదే తంతు

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ (ప్రకాశం జిల్లా) నుంచి పోరుమామిళ్ల (వైఎస్సార్ జిల్లా) వరకు జరుగుతున్న 167బీ జాతీయ రహదారి నిర్మాణపనుల్లో అంతులేని జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరాయకొండ, కందుకూరు మార్గంలో మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఓగూరు సమీపంలో, మాల్యాద్రి కాలనీ సమీపంలో, కందుకూరు- మాలకొండ రహదారిలోని చెర్లోపాలెం, బడేవారిపాలెం వద్ద ఎర్రవాగుపై, పందివాగుపై అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయి.

● ఈ మార్గంలో నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల వద్ద , బైపాస్ రోడ్డులు నిర్మాణం జరుగుతున్న గ్రామాల వద్ద కూడళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసి ఉన్నారు.

● పందివాగుపై వంతెన నిర్మాణం జరుగుతుండగా మిగిలిన చోట్ల వంతెనల నిర్మాణాలు పూర్తయినా అప్రోచ్‌లను నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అక్కడి వరకు నూతన రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలు సరైన ఇండికేటర్లు కూడా లేక షడన్ బ్రేక్‌లు వేసి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిపై జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదని వాపోతున్నారు. రాత్రివేళలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

● వంతెనలు, కల్వర్టుల వద్ద అప్రోచ్‌లను తాత్కాలికంగా బీటీతో సరిచేసినా కొంతవరకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పలుచోట్ల మట్టితోను, మరికొన్ని చోట్ల మెటల్ వేసి వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో సమస్య మరింత జటిలమైందని చెబుతున్నారు.

● కందుకూరు బైపాస్ నిర్మాణంలోను..

167బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కందుకూరుకు బైపాస్ నిర్మాణంలోను మితిమీరిన జాప్యం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మొదట పనులు ప్రారంభించినది కందుకూరు బైపాస్ పనులే. అయినా ఇంతవరకు పనుల్లో ఆశించిన పురోగతి లేదు. దీనికితోడు బైపాస్ డీపీఆర్ రూపకల్పనలోను లోటుపాట్లు ఉండటం, పలు వాగులు, వంకలతోపాటు పట్టణంలోని వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లిపోయేందుకు వీలుగా వంతెనల నిర్మాణం జరగకుండా బైపాస్ నిర్మాణం జరగటం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యతో కందుకూరు పట్టణంలోను అనేక ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే అతి భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కందుకూరు బైపాస్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయటంతో పాటు వరదనీరు సాఫీగా వెళ్లేలా అవసరమైన చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


పందివాగు వంతెన సమీపంలోని అప్రోచ్ రోడ్డు దుస్థితి

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

• బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అందిస్తున్న కండక్టర్ ఇస్మాయిల్

అనంతసాగరం, 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న అనంతసాగరం వాసి ఇస్మాయిల్ విధినిర్వ హణలో తన నిజాయితీ చాటుకున్నాడు. సోమశిల నుంచి ఆత్మకూరుకు మంగళ వారం ఉదయం బస్సు వస్తుండగా, పాతదేవరాయ పల్లికి చెందిన నరసయ్య సెల్‌ఫోన్ బస్సులో పడిపోయింది. దాన్ని భద్రంగా ఉంచి నరసయ్యకు అందించాడు. దీంతో ఇస్మాయిల్‌ను పలువురు అభినందించారు.

రైల్వే పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయండి

• రైల్వే మంత్రిని కోరిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం డిల్లీలో రాష్ట్ర ఎంపీలతో కలిసి ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. రైల్వే పెండింగ్ ప్రాజెక్ట్‌ల త్వరగా పూర్తిచేయాలని ఎంపీ కోరారు. ప్రధానంగా కావలియార్డు, వేదాయపాళెం, అల్లూరు రోడ్డు, వెంకటాచలం, గూడూరు, పడుగుపాడు, తెట్టు-ఉలవపాడు, వెంకటేశ్వరపాళెం తదితర 11 లెవెల్ క్రాసింగ్‌లపై వెంటనే ఆర్‌వోబీ, ఆర్‌యుబీలను నిర్మించాలని కోరారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను పనులను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా బిట్రగుంట రైల్వే ప్రాంతాన్ని అభివృద్ధి చేయలని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌ను బిట్రగుంటలో ఏర్పాటు చేయలని కోరారు.


కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌తో ఎంపీ వేమిరెడ్డి

● మత్స్యకారుల సమస్యలపై

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : కేంద్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తోనూ ఎంపీ వేమిరెడ్డి భేటీ అయ్యారు. జిల్లాలోని మత్స్యకారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. విడవలూరు మండలం పొన్నపూడి పాతూరులో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలని కోరారు. పైడేరుకు ఇరువైపులా డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

● 885 మంది గైర్హాజరు

వెంకటాచలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విక్ర మ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయని వీఎస్‌యూ పరీక్షల నిర్వాహ ణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 8,722 మంది విద్యా ర్థులకు గాను 7,837 మంది హాజరు కాగా 885 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మామిడి పంటకు రూ.45 వేల బీమా

ఉలవపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మామిడి పంటకు ఎకరానికి రూ.2,250 చెల్లించి బీమా చేయించుకుంటే వాతావరణంలో మార్పులు, విపత్కర పరిస్థితులతో పంటకు నష్టం కలిగితే రూ.45వేల వరకు పంట నష్టం ఇన్సూరెన్స్ వస్తుం దని జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక రైతుసేవా కేంద్రం-2లో జరిగిన వాతావరణ ఆధారిత పంట-బీమాపై మామిడి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది మే నెల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఎఫ్‌పీవో గ్రూపులు, రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ ధనుంజయ, ఎఫ్‌పీసీ డైరెక్టర్ బాలచంద్ర, మండల ఉద్యాన అధికారి జ్యోతి, కావలి, వింజమూరు, సంగం ఉద్యాన అధికా రులు, కందుకూరు డివిజన్‌లోని గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో ఈ నెల 22 నుంచి జరగనున్న రాష్ట్ర సబ్ జూనియర్ బాల, బాలికల ఆర్చరీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారుల ఎంపికకు పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు బాల, బాలికలు హాజరయ్యారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో జీ వెంకట లోకేష్, ఏ సాత్విక్, పీ ప్రసన్న కుమార్ యాదవ్, కే హరిశ్రీకర్, కే చక్రీష్‌కుమార్ యాదవ్, పీ నవదీప్ ఎంపిక య్యారు. బాలికల విభాగంలో ఏ ప్రీతి, వై దీత్యా చండిక, ఏ లాస్య, పీ లియాఖాన్, ఎన్ సిరివెల్లి ఎంపికయ్యారు. అలాగే రికర్వ్‌రౌండ్ బాలుర విభాగంలో ఆర్ సాయి మౌర్య, కే తరుణీష్ జాత్యా, సీహెచ్ అక్షయ్ మహదేవ్, పీ రాజేష్, కేకే చరిత్, జీఎం కౌశిక్, బాలికల విభాగంలో డీ నిష్విత అర్హత పొందారు. కాంపౌండ్ రౌండ్ బాలుర విభాగంలో బీ వికాష్ ఎంపిక య్యారు. ఈ ఎంపికలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, కార్యదర్శి పావురాల వేణు, కోచ్‌లు పర్యవేక్షించారు.

సీసీ రోడ్డేసినా సంతోషమేది ?

తమ గ్రామంలో సిమెంటు రోడ్డు వేస్తున్నారని సంతోషపడాలో లేక అడ్డదుడ్డాలుగా వేస్తున్నారన్న బాధపడాలో తెలియడం లేదని విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరువాసులు వాపోతున్నారు. మంగళవారం కోదండరా మాలయం ఎదురుగా సీసీ రోడ్డు పనులను ప్రారంభిం చారు. నాలుగు రోడ్ల కూడల్లో వర్షపు నీరు పోయేందుకు రోడ్డులో కల్వర్టులు ఏర్పాటు చేయాని కోరినా అధికారులు పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. పీఆర్ ఏఈ శ్రీనివాసులు పనుల చేసే సమీపంలో ఉన్న పర్యవేక్షించలేదని ఆరోపించారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)



కొత్తూరులో కల్వర్టు లేకుండా వేస్తున్న సీసీ రోడ్డు

22న క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-12 బాలుర క్రికెట్ జట్టును ఈనెల 22వతేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వ రరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు సెప్టెంబరు 1, 2012 తర్వాత ఆగస్టు 31, 2015లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో ఈనెల 18 సాయంత్రంలోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్టేడియంలోని క్రికెట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

‘ఉపాధి’ అక్రమార్కులపై బిగుస్తున్న ఉచ్చు

- 8మందిపై క్రిమినల్ కేసుకు ఆదేశాలు
- నిధుల రికవరీకి కూడా ఉత్తర్వులు
- రాష్ట్రంలోనే తొలిసారిగా..



సిబ్బందిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు రావడంతో బోసిపోయిన ఉపాధి కార్యాలయం

కలువాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై ఉన్నాతాధికారులు ఉచ్చు బిగిస్తున్నారు. మండ లంలోని చిన్నగోపవరం లో జరిగిన అక్రమాలకు బాధ్యులైన ఎనిమిది మంది సిబ్బందిపై తాజాగా క్రిమినల్ కేసులు పెట్టాలని ఉన్నాతాధికారుల ఆదేశాలు ఇవ్వడం జిల్లాలో కలకలం రేపింది. ఉపాధిలో అవినీతికి పాల్పడినవారిపై క్రిమినల్ కేసులు పెట్టడం రాష్ట్రంలోనే మొదటగా ఇక్కడ జరుగుతుండటం సంచలనంగా మారింది. వైసీపీ హయాంలో చిన్నగోపవరంలో కనీవినీ ఎరుగని రీతిలో అక్రమాలు జరిగాయి. గ్రామంలోని ఎస్సీ ,ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్‌కార్డుల్లో గ్రామానికి సంబంధంలేని బయట వ్యక్తుల పేర్లు చేర్పించి, వారంతా ఉపాధి పనులకు వస్తున్నట్లు బోగస్ మస్టర్లు వేసి దోచేశారు. ఈ ఏడాది మార్చిలో ఈ విషయమై గ్రామస్థులు అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విచారణలో ఈ విషయం వెలుగు చూసింది. అనంతరం జరిగిన సోషల్ ఆడిట్‌లో 148పేర్లు అక్రమంగా జాబ్‌కార్డుల్లో చేర్పించి రూ27.45లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఈ విషయమై అప్పట్లో క్షేత్రసహాయకుడు మహేంద్రరెడ్డి మాత్రమే సస్పెండ్ చేసి అధికారుల చేతులు దులుపుకున్నారు. క్షేత్రసహాయకుడిపై సెప్టెంబరులో స్థానిక అధికారులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయలేదు. ఈ అక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఉపాధి అధికారులు ఇవ్వనందువల్ల కేసు నమోదు కాలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి భవానిహర్ష చిన్నగోపవరం వచ్చి ఈ అక్రమాలపై విచారణ జరిపారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం వేగంగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఏపీవో మురళిని, కంప్యూటర్ ఆపరేటర్‌ను బదిలీ చేశారు. అనంతరం ఇందులో ప్రమేయం ఉన్న ఇద్దరు ఏపీవోలు, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు ముగ్గురు, క్షేత్రసహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్ కలిపి మొత్తం ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిధులు రికవరీ చేయాలని ఆదేశాలు వచ్చాయి.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న కావలి డీఎస్పీ పీ. శ్రీధర్

కావలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిలో ఈ నెల 3వ తేదీన కట్టా ఇందిరను కత్తితో పొడిచి హత్యచేసిన కేసులో ఆమె భర్త కట్టా మస్తాన్‌ను మంగళవారం దుత్తలూరు మండలం వెంకటంపేట గంగమ్మ ఆలయం వద్ద అరెస్టు చేసినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం కావలి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డితో కలిసి డీఎస్పీ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఉదయగిరి ఎస్టీ కాలనీకి చెందిన మస్తాన్, ఇందిర భార్యాభర్తలకు 2ఏళ్ల బాబు ఉన్నా తరచూ వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆయన మద్యం సేవించి రావటాన్ని ఆమె ప్రశ్నిస్తుండటంతో పరిపాటిగా మారింది. అలాగే మస్తాన్ తాగి వచ్చినపుడల్లా భార్యను కొడతుండటంతో భరించలేక కుమారుడిని తీసుకుని వారి పుట్టింటికి వెళ్లింది. అక్కడకు వెళ్లి భార్యను రమ్మని పిలుస్తున్నా ఆమె నిరాకరిస్తూ వచ్చింది. దీంతో ఆయన కొంతకాలం రాజంపేటలో ఉన్నారు. గత నెల 29వ తేదీన మరలా ఉదయగిరికి వచ్చి తన భార్యను కాపురానికి రమ్మని పిలువగా ఆమె నిరాకరించింది. కుమారుడిని కూడా తన దగ్గరకు రానివ్వలేదు. మరలా ఈ నెల 3వ తేదీన పొలంలో మేకలు కాస్తున్న భార్య వద్దకు మస్తాన్ వెళ్లి ఇక తప్పులు చేయను కాపురానికి రమ్మని వేడుకున్నా ఆమె నిరాకరించటంతో అక్కడ గొడవ జరిగింది. దీంతో మస్తాన్ భార్యను కాపురానికి తెచ్చుకోవటమా లేక చంపివేయటమో చేయాలని నిర్ణయించుకున్నారు. అదే రోజు ఆయన అత్తగారి ఇంటి వద్ద ఉన్న భార్య దగ్గరకు వెళ్లి ఆయన కుమారుడిని తన ఇంటికి తీసుకెళ్లారు. దీంతో మస్తాన్ అత్త వచ్చి బిడ్డను ఇవ్వమని కోరగా ఆయన నిరాకరించటంతో భార్య వెళ్లి బిడ్డను ఇవ్వమని కోరగా ఆయన నిరాకరించటంతో అక్కడ గొడవ జరిగింది. దీంతో భార్యను హతమార్చేందుకు పక్కా ప్లాన్‌తో ఉన్న మస్తాన్ తన ఇంటిలో ఉన్న కత్తితో విచక్షణారహితంగా పొడవటంతో ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటానికి కృషి చేసిన ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

రాపూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచలకోనలో దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా మంగళవారం మోటారు బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆత్మకూరుకి చెందిన ఆర్.బాబుకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి, అతన్ని రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన బాబు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	89
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	168
స్కిన్‌లెస్	188
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7401
వెండి కిలో ధర	రూ. 95,300
వెండి ఒక గ్రాము	రూ.98.30

బైక్ బోల్తాపడి యువతికి తీవ్రగాయాలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం సోమలరేగడ ఎస్సీ కాలనీ సమీపంలో మంగళవారం మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ యువతికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. ఉదయగిరి మండలం దాసరిపల్లికి చెందిన సానియా వేరొకరి మోటార్‌బైక్‌లో దుత్తలూరు నుంచి ఉదయగిరికి వస్తోంది. సోమలరేగడ ఎస్సీ కాలనీ సమీపానికి రాగానే వంతెన వద్ద మోటార్‌బైక్ అదు పుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సానియాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేషన్ విభజన !

- వైసీపీ పాలనతో గందరగోళంగా వ్యవస్థ
- డీలర్లకు కార్డుల కేటాయింపులో భారీ వ్యత్యాసం
- కొందరికి 1500కుపైగా...
- మరికొందరికి 250లోపే!
- రేషనలైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- ఒక్కో డీలర్‌కు కనీసం 400 కార్డులు
- కొత్తగా 128 చౌక దుకాణాలు
- 397 మంది డీలర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్



సరుకుల కోసం ఎండీయూ వాహనం వద్ద క్యూ కట్టిన కార్డుదారులు (ఫైల్)

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దీనిని సరిదిద్దేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. దీనితోపాటు కార్డుదారులకు మెరుగైన సేవలను అందించ డానికి చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల పరిధి పేరుతో చేసిన మార్పుల నేపథ్యంలో రేషన్‌కార్డులు, రేషన్‌షాపుల సంఖ్యలో ఎక్కువ వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయి. ఖాళీ అయిన షాపుల్లో తాత్కాలిక డీలర్లకు అవకాశం కల్పించారు. ఎండీయూ వాహనాల వారు సరకుల పంపిణీ వ్యవహారంలో చేతులెత్తేసిన ప్రాంతాల్లో డీలర్లతోనే సరకుల పంపిణీ చేయిస్తున్నారు. నెల్లూరు నగరం, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో రాజకీయ పలుకుబడితో 1500 నుంచి 2వేలకుపైబడిన కార్డులతో రేషన్ షాపులను నిర్వహిస్తున్న డీలర్లు కొందరు ఉన్నారు.. వారే రెండు మూడు షాపులకు ఇన్‌చార్జులుగానూ వ్యవహరిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతా ల్లోని కొన్ని రేషన్ షాపుల పరిస్థితి అధ్వానంగా ఉంది. 60 నుంచి 250 కార్డులు మాత్రమే కలిగిన చౌకదుకాణాలు కూడా ఉన్నాయి. ఎక్కువ కార్డులు కలిగిన డీలర్లు బాగా లాభాలు ఆర్జిస్తుండగా కార్డులు తక్కువగా ఉన్న డీలర్లు నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట కార్డులన్నీ సరిసమానంగా డీలర్లకు సర్దుబాటు చేసే ప్రక్రియకు పూనుకుంది.

కార్డుల విభజన ఇలా...

రేషన్ షాపులకు కార్డుల విభజన ఒక క్రమపద్ధతిలో చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఒక డీలరుకు 600-650 కార్డులు, మున్సిపాలిటీల్లో 500-550, గ్రామీణ ప్రాంతాల్లో 400-450, గ్రామ పంచాయతీలో ఒక డీలరుకు కనీసం 400 కార్డులు ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా రేషన్ షాపుల రేషనలైజేషన్ జిల్లాలో పూర్తయింది. తక్కువ కార్డులున్న చౌక దుకాణానికి ఎక్కువ కార్డులున్న షాపు నుంచి సర్దుబాటు చేశారు.

> **ఆర్డీవోలు నోటిఫికేషన్ ఇస్తారు**
>
> జిల్లాలో రేషన్ షాపుల రేషనలైజేషన్ తరువాత కొత్తగా 128 షాపులు ఏర్పాటవుతాయి. డీలర్ల భర్తీకి ఆర్డీవోలు నోటిఫికేషన్ ఇస్తారు.
>
> - డీవీ రమణ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి



128 కొత్త షాపులు

జిల్లాలో 7,33,771 రేషన్ కార్డులు, 1513 రేషన్ షాపులు, 469 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. 269 రేషన్ షాపులకు డీలర్లు లేరు. ఇన్‌చార్జులే వాటిని నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం కార్డుల విభజన తరువాత కొత్త రేషన్ డీలర్లు అవసరమవుతారు. ఈ క్రమంలో జిల్లాలో 128 కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. డీలర్లు లేని 269 షాపులను కలిపితే మొత్తం 397 రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఇంటర్ చదివిన వారిని రాత పరీక్ష ద్వారా డీలర్లుగా నియమించనున్నారు. ఇదిలా ఉండగా ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ సకాలంలో, సక్రమంగా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో నని కార్డుదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రేషన్ వ్యవస్థలో లోపాలను సరిచేసి, రేషన్ పంపిణీని మెరుగుపరచి, పేదలకు సంతృప్తికరంగా సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాజముద్రతో రైతులకు పాసుపుస్తకాలు : మంత్రి ఆనం



అర్జీదారుతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందచేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు మండలం నాగులపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జగన్ బొమ్మలతో పాసు పుస్తకాలు ఇచ్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇప్ప టి వరకు జిల్లా వ్యాప్తంగా 153 రెవెన్యూ సదస్సులను నిర్వహించి, 500 పైగా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. అనంతరం నాగులపాడులో వేసిన సీసీ రోడ్డును, దాతల సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. అలాగే నాగులపాడు రైతుల చిరకాల కోరిక అయిన పంట కాలువపై బ్రిడ్జిని మంజూరు చేస్తూ, సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనానాయక్, ఆర్డీవో పావని, తహసీల్దారు సుధీర్, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి పుట్టా సత్యవాణి



మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కలిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరి, శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా బీమా చేయించు కోవాలని జిల్లా వ్యవసాయాదికారి పుట్టా సత్యవాణి సూచించారు. తూర్పు దూబగుంటలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎకరాకు వరికి రూ.168, మినుముకు రూ.38, పెసరకు రూ.36, వేరుశనగకు రూ.60 వంతున చెల్లించి బీమా చేయించుకో వాలన్నారు. వరికి డిసెం బరు నెలాఖరు వరకు గడువు ఉందని, మిగిలిన పంటలకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రైతులు తమ గ్రామ పంచాయతీల పరిధిలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల ధృవీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకుఖాతా జెరాక్స్‌లతో కలవాలన్నారు. అనంతరం సాగులోని మినుము పంటను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో వింజమూరు ఏడీఏ రామిరెడ్డి, డీఎఓ కార్యాలయ ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరిరావు, ఏఓ ఎం సురేష్‌బాబు, వీఏఓలు, రైతులు పాల్గొన్నారు.

గర్భంలోని పిండానికి హక్కులు వర్తింపు

- ప్రమాదకర చట్టాలను అనుమతించకూడదు
- స్పెషల్ జడ్జి శ్రీనివాసరావు



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసరావు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తల్లి గర్భంలోని పిండం నుంచి మృత్యువు ఒడిలోకి వెళ్లేంతవరకు ప్రతి ఒక్కరికీ హక్కులు వర్తిస్తాయని జిల్లా స్పెషల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులమతాలు, పేద,ధనిక తేడాలు ఉండవన్నారు. ఇతరదేశాల్లో అమలు చేస్తున్న కొన్ని ప్రమాదకర చట్టాలను మన దేశంలోనికి రానీవ్వకుండా చూడాలన్నారు. కొన్ని దేశాల్లో వెట్టిచాకిరి, వ్యభిచారం చట్టాలు ఉండటంతో వారి జీవితాలకు ప్రమాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నాయని వాపోయారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో అన్ని శాఖలు పనిచేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మానవ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, డీటి ప్రవీణ్‌కుమార్; ఈవోపీ ఆర్డీ పెంచల వీరేంద్ర, ఎల్లు సాల్మన్ రాజు, గున్నం చిన్నారావు, గాలి వేణుగోపాల్, దానం మాల్యాద్రి, మందా రవికుమార్, పొంగులూరు సుధాకర్, గంగపట్నం సతీష్, కందల గిరిధర్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

53 మద్యం సీసాల పట్టివేత

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై మంగ ళవారం నెల్లూరు టాస్క్‌ఫోర్స్ సీఐ అనితారెడ్డి, ఉదయగిరి ఎస్ఐ దీప్తికరంత్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ టీ.లక్ష్మణస్వామి తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ‘ఊరికో బెల్టు!’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నెల్లూరు టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఉదయగిరి ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి, దుత్తలూరు మండలం కమ్మవారి పాళెంలో 35, నంది పాడులో 10, మర్రిపాడు మండలం పొంగూరు కండ్రికలో 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రా మాల్లో ఎం.నాగరాజు, బీ.నరసింహులు, ఎం.గణేష్‌బాబులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారిక మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలపై సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

మోటార్ బైక్ చోరీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పార్కింగ్ చేసిన మోటా ర్‌బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రామారావు అనే వ్యక్తి బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాల వద్ద తన మోటార్‌బైక్‌ను సోమవారం రాత్రి పార్కు చేశాడు. మం గళవారం ఉదయం వచ్చి చూసేసరికి అది కనిపించలేదు. చుట్టుపక్కల వారిని విచా రించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- రూ.20 లక్షల వసూలు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్షలు తీసుకొని మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని పడారు పల్లిలో దేవానందం కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమార్తె హైదరాబా ద్‌లో ఎంబీఏ చదువుతోంది. దేవానందంకు విక్రమ్‌నగర్‌కు చెందిన సువర్ణ రాజు ద్వారా జీ బెనర్జీ అనే వ్యక్తి ఎస్‌బీఐ ఉన్నతాధికారిగా పరిచయం అయ్యారు. దేవానందం కుమార్తెకు బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని, గతంలో సువర్ణరాజు కుమార్తెకు నెల్లూరు బారకాస్‌లోని ఎస్‌బీఐలో ఉద్యోగం ఇప్పించానని బెనర్జీ నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన దేవానందం ఉద్యోగ నిమిత్తం రూ.20 లక్షలు బెనర్జీ దంపతులకు ఇచ్చారు. అనంతరం ఫోన్‌లో కొంత నగదు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ క్రమంలో బ్యాంకు ఉద్యోగానికి అవసరమైన శిక్షణ కోసం హైదరాబాద్‌లోని రేస్ ఇన్‌స్టిట్యూట్‌లో కుమార్తెను చేర్పించమని దేవానందంకు బెనర్జీ సూచించారు. దేవానందం అలాగే చేశారు. అక్కడ బెనర్జీ మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఇదే తరహాలో ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ. 4 లక్షలు, ఖమ్మంకు చెందిన మరో వ్యక్తి వద్ద రూ.6లక్షలు తీసుకొని మోసించాడని తెలిసింది. సువర్ణరాజు, బెనర్జీ తమను పథకం ప్రకారం మోసగించారని తెలుసుకున్న దేవానందం వారిని నిలదీయగా వారు చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ పోస్టుపై గిరిజనుల ఆందోళన

వైసీపీ వర్గ మహిళకు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలోని అంగ న్‌వాడీ పోస్టుపై గిరిజనులు మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో ఇక్కడ పనిచేసిన అంగన్‌వాడీ కార్యకర్త పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యిందన్నారు. ఆమెస్థానంలో స్థానిక యువతికి కాకుండా స్థానికేతరులైన వైసీపీకి చెందిన మహిళకు ఇస్తూ ఆదేశాలు జారీ చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న సూపర్‌వైజర్ వారిని సర్దిచెప్పి అక్కడి నుండి పంపించేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పీజీ పరీక్షలకు అనుమతులు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ విద్యాసంస్థల్లో పీజీ పరీక్షా కేంద్రానికి అనుమతులు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎ.హర్రిప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా తమ విద్యాసంస్థల్లో పీజీ కళాశాలను నిర్వహిస్తున్నా పరీక్షలు రాసేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకే విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీని కోరగా ఆయన స్పందించి అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. తొలుత జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని తదుపరి సాధారణ స్థితిలో పరీక్షలు నిర్వహించేలా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ముప్పా గంగిరెడ్డి, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంకు త్రెడ్డింగ్ చిత్రపటం బహూకరణ

సంగం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జండాదిబ్బకి చెందిన ఆనం అభిమాని సూరాయపాళెం పవన్‌కుమార్ త్రెడ్డింగ్‌తో తయారు చేయించిన చిత్రపటాన్ని మంగళవారం మంత్రి రామనారాయణరెడ్డికి బహూకరించారు. కాకినాడకు చెందిన త్రెడ్డింగ్ ఆర్టిస్టు 240 శీలలు, ఏడు కిలోమీటర్ల దారం, 4,500 లైన్లతో ఆనం చిత్రాన్ని తయారు చేశారు. ఈ చిత్రపటాన్ని నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయనకు అంద చేశారు. కార్యక్రమంలో వెంగారెడ్డిపాళెం సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి, సిద్దీపురం శ్రీనివాసులురెడ్డి ల్గొన్నారు.



తెడ్డింగ్ చిత్రపటాన్ని మంత్రి ఆనంకు అందచేస్తున్న అభిమాని

రాష్ట్రస్థాయి కౌశల్-2024కు గురుకుల విద్యార్థి

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని అంబేడ్కర్ గురుకుల విద్యార్థిని ఒంగోలు ఉమామహేశ్వరి కౌశల్-2024 పోస్టల్ ప్రజంటేషన్‌కు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఉమామహేశ్వరి ఈ నెల 6న జిల్లాస్థాయి ఆన్‌లైన్ పరీక్షను జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థిని, పరీక్షకు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు ప్రవీణ, శ్రీవిద్యలను ప్రిన్సిపాల్ అభినందించారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

● శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి



కావలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

? : పనుల మెరుగుదలకు ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! : రోడ్లపై చెత్త కాని, డంపర్ బిన్‌లు కాని కనిపించకుండా ఉండేలా చూస్తాం.

? : కొత్త ప్రణాళిక ఉంటుందా.

! : ఇంటింటా సేకరించిన చెత్తను బంపర్‌బిన్‌లలో పోయకుండా ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి వాటిని ఐరన్‌మెన్‌లతో తయారు చేసిన ప్రదేశాలలో భద్రపరుస్తారు. అక్కడకు ట్రాక్టర్లు వచ్చి చెత్త తీసుకెళతాయి.

? : ట్రాక్టర్లు తీసుకెళ్లే చెత్తను ఎక్కడకు తరలిస్తారు.

! : తుమ్మలపెంట రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రాంతంలో కాం పాక్ట్ వాహనదారులకు అందజేస్తారు. వారు డంపింగ్ యార్డుకు తరలిస్తారు.

ఫలితాల్లో రోల్ 'మోడల్'

మూడేళ్లుగా 'పది'లో ఉత్తమ ఫలితాలు
క్రీడలతోపాటు ఎన్‌సీసీలోనూ ప్రావీణ్యం



వలేటివారిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా చుండి ఆదర్శ పాఠశాల ఫలితాల్లో పేరు తెచ్చుకుంటోంది. 551 మంది విద్యార్థులు చదివే ఈ పాఠశాలలో టీచర్లు ప్రత్యేక తరగతులు, ఉత్తమ విద్యను అందిస్తున్నారు. చదువు ఆటల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

గత ఏడాది పది ఫలితాల్లో..

పాఠశాలలో చదివిన పది విద్యార్థి బొమ్మారెడ్డి జగన్ 588 మార్కులతో నియోజకవర్గ టాపర్‌గా నిలిచాడు. అలాగే ఇంటర్‌లో దోసకాయలపాటి మాధురి 981మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థికి ప్రభుత్వం ఇచ్చే రూ.50వేల ప్రోత్సాహక నగదును అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రంను అందుకుంది. అలాగే అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి విద్యార్థి ప్రతిభను గుర్తించి రూ.13వేలు సొంత నగదును అప్పటి సబ్ కలెక్టర్ శోభిత చేతుల మీదుగా అంద జేశారు. 12మంది విద్యార్థులు ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీట్లు పొందారు.



కీడలో వచ్చిన అవార్డులు (ఫైల్)

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లో..

విద్యార్థులు పి.రాకేష్, సీహెచ్.హృత్విక్ సాయి కోటి, బి.నవ్యశ్రీలు ఏడాదికి రూ.12 వేలు చొప్పున 4ఏళ్లకు రూ.48వేలు స్కాలర్‌షిప్ పొందుతున్నారు. అంతేగాకుండా 28మంది ఎన్‌సీసీకి ఎంపికైనారు. వీరికి ట్రిపుల్‌ఐటీ, మెడికల్, ఇంజనీరింగ్, ఎంసెట్‌లో 3శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అలాగే నేషనల్ చిల్డ్రన్స్ సైన్సు కాంగ్రెస్‌కు రాష్ట్రస్థాయిలో చెరువుపల్లి హృత్విక్ ఎంపికైయ్యారు. మోడల్‌స్కూల్ వృత్తి విద్యా కోర్సుల్లో నియోజకవర్గంలోనే హబ్ స్కూల్‌గా ఎంపికైంది. అంతేగాకుండా స్పోర్ట్స్, జగనన్న ఈవెంట్స్‌లో విద్యార్థులు ఎన్నో అవార్డులు సాదించారు.

దాతల సహకారంతో

పాఠశాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు లేవని ప్రిన్స్‌పల్ చెప్పడంతో వలేటివారిపాలెం జడ్పీటీసీ దంపతులు ఇంటూరి భారతి - హరిబాబులు రూ.10వేలు అందజేశారు. అయ్యవారిపల్లె టెంకం కొండలరావు అనే వ్యాపారవేత్త రూ.5వేల విలువ చేసే మైక్‌సెట్‌ను బహూకరించారు.

ప్రథమ స్థానంలో నిలవడమే లక్ష్యం



మోడల్ స్కూల్‌ను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యం. ప్రత్యేక తరగతులు, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం.

\- శ్రీవెంకటేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్,చుండి

భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అయ్యవారిపల్లెలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



సీతారామపురం: అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. అయ్యవారిపల్లె సచివాలయంలో మంగళవారం జరిగిన సదస్సులో సబ్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతుల వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రసాద్, ఎండోమెంట్ ఈఓ పావని, పారెస్ట్ బీట్ ఆఫీసర్ శేషుబాబు, వీఆర్వో నారాయణ పాల్గొన్నారు.

● జలదంకి: బి.కెఅగ్రహారంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దారు ప్రమీల హాజరై అర్జీలు స్వీకరించారు. మొత్తం 26అర్జీలు అందినట్లు తెలిపారు. వీటిని 45రోజుల లోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీజ, వీ ఆర్వో తిరుపతయ్య, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.

● సంగం: తలుపూరుపాడు, నీలాయపాళెంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఉదయం తలుపూరుపాడులో, మధ్యాహ్నం నీలాయపాళెంలో సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తలుపూరుపాడులో పలువురు భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాజున్ని, స్థానిక నాయకులు షేక్ బాబు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దారు సుభద్ర పేర్కొన్నారు.అప్పసముద్రం, దాసరిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతులు 68 అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో కవిత, ఆర్ఐ డీటీ హసీనా, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వోలు చెన్నకృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: బోడవారిపల్లిలో తహసీల్దారు వై.నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గుంపార్లపాడులో..

ఏఎస్‌పేట: గుంపార్లపాడులో తహసీల్దార్ వెంటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారుపాసు పుస్తకాలు, మ్యుటేషన్, వన్‌బీ అడంగల్ కరెక్షన్స్ సమస్యలపై 32 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రంగారెడ్డి, ఆర్ఐ మస్తాన్‌వలి, వీఆర్వో రమణయ్య, సర్వేయర్లు అజీజ్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం: తహసీల్దార్ సీతామహాలక్ష్మి మొగిలిచెర్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో 18మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి రమణయ్య, వీఆర్ఓ అమానుల్లాఖాన్, సర్వేయరు వెంకటేష్ పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండలకేంద్రంలో జరిగిన సదస్సుకు 39 అర్జీలు వచ్చాయి. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య పాల్గొన్నారు.

● వరికుంటపాడు: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దారు హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. గణేశ్వరాపురం, నారసింహాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు 81అర్జీలు అందచేశారు. ఈ అర్జీలకు త్వరలో పరిష్కార మార్గం చూపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ యశ్వంత్ కుమార్, వీఆర్వోలు మనోహర్, ప్రసాద్, సర్వేయర్లు విష్ణు, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో 35 మంది రైతులు వినతులు అందజేశారు. బోగోలు, అక్కరాజు వారి కండ్రిక, నాగులవరం పంచాయతీల రైతులు ఎక్కువగా వచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ వాజీద్, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, ప్రసన్న ఆలయ ఈవో రాధాకృష్ణ, వీఆర్వోలు ఉన్నారు.

● సీతారామపురం: పబ్బులేటిపల్లి సచివాలయంలో తహశీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు,సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



తలుపూరుపాడులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్

న్యూస్ బాక్స్

బీఎంఆర్ ఎంపికపై హర్షం

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎంఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు రాజ్యసభకు ఎంపిక కావడం శుభపరిణామమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మంగళవారం ఆయన విజయవాడలో బీద మస్తాన్‌రావును కలుసుకొని పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట చైతన్య పాల్గొన్నారు.

ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు. వారి వెంట న్యాయవాది పోకూరి కోటయ్య పాల్గొన్నారు.

నాగబాబుకు ఎంపికపై హర్షం

కావలి, డిసెంబరు 10: జనసేన సీనియర్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదల నాగబాబుకు రాష్ట్రమంత్రివర్గంలో చోటు కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడం శుభసూచకమని జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం ఆయన స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అనంతరం జనసైనికులకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు స్థానిక ట్రంకు రోడ్డులోని బ్రిడ్జి సెంటర్‌లో బాణసంచా కల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి విఠల్ ఉన్నారు.

రాళ్లపాడు నీటి విడుదలపై ఎమ్మెల్యేల చర్చ

కొండాపురం, డిసెంబరు10: రాళ్లపాడు కుడి కాలువ ద్వారా మండలానికి సాగు నీటిని విడుదల చేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చించడం హర్షనీయం అని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ మండల మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని అన్నారు. ఈ విషయంపై మంగళవారం వారు మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాళ్లపాడు జలాశయం కుడి కాలువ కింద మండల రైతులు ఈ ఏడాది 3వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. కాలువ గేటు మరమ్మతులతో వారిలో ఆందోళన నెలకొందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన కుందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చించి బుధవారం కాలువకు నీరు విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



కందుకూరు: సమావేశంలో పాల్గొన్న నేతలు

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా బలపడేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధరరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్యనాయుడు, భాస్కరగౌడ్, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, సురేష్, ముప్పల భూషయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు.

● బూత్ కన్వీనర్ల సమావేశం

వింజమూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోనుగుంట రామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం బీజేపీ ఉదయగిరి నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్‌జీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ గ్రామస్థాయిలో బలపడేలా అందరూ కృషి చేయాలన్నారు. అలాగే బూత్‌కన్వీనర్ల నియామకం చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకురాలు మిడదాల రమణమ్మను సన్మానించారు. దివ్యాంగుడైన సచ్చు వినోద్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు దేగ మధుయాదవ్, జిల్లా ఇన్‌చార్జి వెంకయ్యనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కేవీ రంగారావు, అన్నీ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుస్థిరావృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ

వింజమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సర్పంచులు, సచివాలయం సిబ్బందికి రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. 9 లక్ష్యాలను సాధించేందుకు గ్రామ పంచాయతీలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని, నిర్ణీత గడువులో లక్ష్యసాధనకు కృషి చేయాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా పంట నష్టం వివరాల నమోదు

వరికుంటపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో 33శాతం కన్నా ఎక్కువ పంట దెబ్బతిన్న రైతులు ఈ నెల 12వ తేదీలోగా వీఏఏల వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని మండల ఏవో రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తోటలచెరువుపల్లి, జీ.కొండారెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమా పథకం కింద మామిడి పంటకు ఎకరానికి రూ.2,250లు ప్రీమియం చెల్లిస్తే నష్టపోయిన రైతులకు రూ.45 వేలు వస్తుందని ఉద్యానవన శాఖాధికారిణి జయశ్రీ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీద లక్ష్మానందకు జాతీయ సేవా పురస్కారం

కావలి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకుడిగా జాతీయ స్థాయిలో విశేష సేవలందిస్తున్న లైఫ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బీద లక్ష్మానంద జాతీయ సేవా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం కాకినాడలోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డుపాటి దాసు ఈ సేవా పురస్కారం అందజేశారు.

ఉత్సాహంగా డివిజన్ స్థాయి జూ.కళాశాలల క్రీడా పోటీలు



మెమెంటోలు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

ఆత్మకూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం డివిజన్ స్థాయి జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు జరిగాయి. నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం యూత్ అధికారి మహేంద్రరెడ్డి, జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రీడల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఖోఖో, పరుగుపందె, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. తదుపరి హ్యూమన్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, అవగాహన కల్పించారు. ముగింపులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందచేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దారు వై.నాగరాజు హెచ్చరించారు. మందాలనాయుడుపల్లిలో శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారని పిర్యాదు అందడంతో మంగళవారం సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. ఆక్రమణదారుడిపై చర్యలు చేపట్టడంతోపాటు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా మండలంలోని బోడవారిపల్లి ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలను తహసీల్దారు సందర్శించారు. దాతల సహాయంతో పాఠశాల ఆవరణను చదును చేయించారు.

సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

ఏఎస్‌పేట, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబ్బీపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో సాయిప్రసాద్ సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పూర్వవిద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని హెచ్ఎం నెల్లూరు సురేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి అల్లంపాటి మాధవరెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం ఫణిదర్, జనసేన నాయకులు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):సబ్‌డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ డీఈ, ఎన్నికల నోడల్‌అధికారి చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్‌లోని గండిపాళెం జలాశయానికి సంబంధించి 17 డిస్ట్రిబ్యూటరీలు, ఉదయగిరి మండలంలో 11, సీతారామపురం మండలంలో ఆరు చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 14న ఉదయం 8నుంచి 9గంటల వరకు టీసీ మెంబర్ల సమావేశం, 9.45 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల ఎన్నికలు జరుపుతామన్నారు. పోటీచేసే వ్యక్తులు తప్పనిసరిగా నీటితీరువా పన్నులు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పోటీ చేసే అదే సంఘంలో వ్యక్తి ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు.

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మొగిలిచెర్ల, లింగసముద్రం, విశ్వనాదపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం సాగునీటి చెరువుల సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేస్తున్నట్లు ఎన్నికల నోడల్ అధికారి చంద్రమౌళి తెలిపారు.

ఉద్యోగాలకు 19 మంది ఎంపిక

ఉదయగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎల్.నారాయణస్వామి తెలిపారు. జాబ్‌మేళాకు 41 మంది పాల్గొనగా, వారిలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అక్మల్, శివ పాల్గొన్నారు.

సంక్రాంతి తరువాత పనుల ప్రారంభం : మంత్రి ఆనం

మర్రిపాడు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సోమశిల హైలెవెల్ కెనాల్ మొదటి విడత పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పనులకు సంక్రాంతి తరువాత ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని పొంగూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సు అనంతరం ఆగిపోయిన సోమశిల హైలెవెల్ కెనాల్‌ను, పొంగూరు రిజర్వాయర్‌ను మంత్రి సందర్శించారు. సీఎం చంద్రబాబు ఇటీవల సోమశిల ప్రాజెక్ట్‌ను సందర్శించి, హైలెవెల్ పంపింగ్ స్కీమును చూసి పనులు ప్రారంభించమని అధికారులను ఆదేశించమన్నట్లు తెలిపారు. మొదటి విడతగా పొంగూరు, పడమటినాయుడుపల్లి రిజర్వాయర్‌లకు మరో 2500ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. హైలెవెల్ పనులు పూర్తికాగానే వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా నీటిని తీసుకొచ్చి, 44వేల ఎకరాలకు సాగునీరు అందేలా చూస్తామన్నారు.



పొంగూరు కట్ట పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం, తదితరులు

● కక్ష సాధింపునకే ఆస్తుల మార్పిడి

ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునేందుకు గత ప్రభుత్వంలో ఆస్తుల మార్పిడి జరిగిందని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. అన్నీ హక్కులు ఉన్నా.. ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునేందుకు వారి ఆస్తులను సైతం దేవుడి భూములుగా కంప్యూటర్ అడంగల్‌లో నమోదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శీనానాయక్, ఆర్డీవో పావని, టీడీపీ నాయకులు గిరినాయుడు, రవీంద్రరెడ్డి, అరికట్ల జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

నెల్లూరు (సిటీ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ స్రవంతి సూచించారు. నగరంలోని 13వ డివిజన్‌లో ఆమె మంగళవారం పర్యటించారు. నగరంలో పారిశుధ్య లోపం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలు వల్లో పూడికతీసి ఆయిల్ బాల్స్ వేయాల న్నారు. కార్మికులు లేని ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో దోమల నివారణ మందులు చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాగార్జున పాల్గొన్నారు. కాగా, నగర రోడ్లు అపరిశుభ్రంగా ఉంటే అందుకు కారకులైన వారికి జరిమానా విధిస్తామని ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య హెచ్చరించారు. ఆయన అపోలో ఆసుపత్రి ప్రాంతంలో పర్యటించారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తిస్తామన్నారు.

ప్రజలకు ప్రయాణ కష్టాలు రానివ్వొద్దు : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని మున్సిపల్ ప్రాంతాల ప్రజలకు ప్రయాణ కష్టాలు రానివ్వకుండా రోడ్లను ఆధునీకరించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం 21వ డివిజన్‌లో జరుగుతున్న రోడ్ల ఆధునికీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రూరల్లోని 26 డివిజన్లలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. రూ.1.15 కోట్లతో రోడ్లను ఆధునీకరించేందుకు గడిచిన కొన్ని రోజులుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి సాయిబాబా పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కోవూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు నిర్మలానందబాబ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటుహక్కు పొందే వయస్సున్న విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రాంతంలోని బీఎల్వోల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అశోక్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులకు దంత వైద్య సేవలు అందించారు. డాక్టర్లు కే గణేష్‌కుమార్, సీహెచ్ శ్రీకాంత్, ఎస్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'భవిత'లో దివ్యాంగుల దినోత్సవం

మనుబోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 3వ తేదీన నిర్వహించాల్సి ఉండగా వర్షాల కారణంగా వాయిదా పడింది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఐఈఆర్‌టీలు శ్యామల, షర్మిల, ఫిజియోథెరపిస్టు నాగరాజు, ఉపాధ్యాయులు డేవిడ్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అవగాహన

వెంకటాచలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం మహిళా సాధికారత, బాలల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటి బచావో - బేటి పడావో, బాల్య వివాహాలు అరికట్టడం, బ్యాడ్ టచ్ - గుడ్ టచ్, రక్తహీనత వల్లన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నాగ అపర్ణ, బీ సుజాత, ప్రీతి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వెంకటాచలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లికి చెందిన వెంకయ్య(78) ఈనెల 5న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గుర్తించిన బంధువులు చికిత్స నిమిత్తం 108లో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోకులం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

గోకులం పనుల పరిశీలన

కోవూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడులో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న గోకులం పనులను మంగళవారం డ్వామా పీడీ గంగాభవాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోకులాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. రైతుల భాగస్వామ్యంతో గోకులాలను నిర్దేశిత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డును ఆమె పరిశీలించారు. ఆమె వెంట డ్వామా ఏపీవో సుబ్బారావు ఉన్నారు.

అడ్మిన్ల బదిలీకి సిద్ధం!

- కార్పొరేషన్‌లో ముమ్మర కసరత్తు
- పాలనలో వైఫల్యం, పనితీరుపై విమర్శలు
- కొత్త ఆర్‌ఐలను దారిమళ్లిస్తున్నట్లు ఫిర్యాదులు
- స్థానచలనానికి అధికారుల నిర్ణయం?



నెల్లూరు(సిటీ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని డివిజన్ సచివాలయాల్లో పాతుకుపోయిన అడ్మిన్ల బదిలీకి రంగం సిద్ధమవుతోందని సమాచారం. దీనిపై నగర పాలక సంస్థలో తీవ్ర కసరత్తు జరుగుతోందని తెలిసింది. ఇటీవల భారీ సంఖ్యలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలను బదిలీ చేసిన కమిషనర్ సూర్యతేజ అదే తరహాలో అడ్మిన్లను బదిలీ చేయాలని సంకల్పించినట్లు విశ్వసనీయ సమాచారం. సచివాలయ పాలన కుంటుపడటం, ఆస్తి పన్ను వసూళ్లలో జాప్యం, ఉన్నతాధికారులకు అందుబాటులో లేకపోవడం వంటి ఆరోపణలు అడ్మిన్లపై బలంగా వినిపిస్తుండటంతో బదిలీ వేటు వేయాలని అధికారులు నిర్ణయించి నట్లు తెలిసింది. కొత్తగా బాధ్యత చేపట్టిన ఆర్‌ఐలను అడ్మిన్లే తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు బదిలీల వార్తకు బలం చేకూరుస్తున్నాయి.

నగరంలో 800 - 1700 ఇళ్లను ఒక సచివాలయ పరిధిగా నిర్ణయించారు. ఈ సచివాలయానికి అడ్మిన్ సర్వాధికారిగా వ్యవహరిస్తారు. ఆస్తి పన్ను వసూళ్లలోనూ వీరిదే కీలకపాత్ర. అయితే వీరి పనితీరుపై ఆరోపణలు, విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కమిషనర్ సూర్యతేజ ఇటీవల జరిపిన ఆకస్మిక తనిఖీల్లో మరిన్ని విస్తుపోయే విషయాలు తెలిశాయి. అంతేకాక సచివాలయాల తనిఖీకి నియమించిన ప్రత్యేక అధికారులు ఒక్కరు కూడా సానుకూల నివేదిక ఇవ్వకపోవడంతో అడ్మిన్లను బదిలీ చేయక తప్పదనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ఏళ్ల తరబడి ఒకే స్థానంలో....

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అప్పట్నుంచి ఒకే స్థానంలో అడ్మిన్లు పాతుకుపోయారు. అంతేకాక గత ప్రభుత్వంలో వైసీపీ నాయకత్వంతో వీరంతా అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలనే ఆలోచనతోనూ అడ్మిన్లను బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. నగరంలోని సచివాలయాల్లో పని చేస్తున్న అడ్మిన్లు ముప్పాతిక శాతం వరకు బిల్లు కలెక్టర్లు కావడంతో పూర్తి స్థాయిలో ప్రజలకు సేవలు అందించలేకపోతున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలోనూ ఆశించిన ఫలితాలు అందలేదు. దీనికితోడు ఉన్నతాధికారుల మాట వినకపోవడం, రాజకీయ నాయకుల జోక్యం మితిమీరడం వంటి అంశాల నేపథ్యంలో అడ్మిన్లపై బదిలీ వేటుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

చివరి దుక్కిలో భాస్వరం వేసుకోవాలి

- 'పొలం పిలుస్తోంది'లో ఆత్మ పీడీ శివన్నారాయణ



ఇందుకూరుపేట : వరిపైరు పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట/తోటపల్లిగూడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు భూసారం పెంపునకు పొలానికి పై పాటుగా కాకుండా చివరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 24 కిలోల భాస్వరం వేసుకుంటే మొక్కల వేరు వ్యవస్థకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆత్మ పీడీ, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి డీడీ శివన్నారాయణ తెలిపారు. అంతకంటే ఎక్కువ వేస్తే అది మిగతా పోషకాల లభ్యతను తగ్గిస్తుందని తెలిపారు. మంగళవారం ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేట, దేవిస్‌పేట, తోటపల్లి గూడూరు మండలంలోని సౌత్‌ఆములూరు, ముంగాలదొరువు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నారుమడులు, నాట్లు వేసిన వరిపొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నారుమడులలో అగ్గి తెగులను నివారించుకోవాలన్నారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఏ.రాజ్‌కుమార్, ఏవోలు డీ.రఘునాథరెడ్డి, వీవీ.శిరీషరాణి, కేవీకే కో ఆర్డినేటర్ లలితా శివజ్యోతి, కిరణ్ కువార్, వీఏఏలు పెంచలయ్య, వీహెచ్‌ఏ మాధవయ్య, కుసుమ, కావేరి పాల్గొన్నారు.

పీఎం పీబీవై రైతులకు భీమా

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం రైతులకు భీమా కలిగిస్తుందని కోవూరు ఏడీఏ డి.సుజాత తెలిపారు. మంగళవారం మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలోఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని వరి పైర్లను సందర్శించారు. ఈ నెల 31వ తేదీ లోగా ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఇందు, కే.సుజాత, ఇందుప్రియ, ఏఈవో ఎస్.ఇందు తదితరులు పాల్గొన్నారు.

కనుపూరు, చవటపాళెంలలో..

వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపూరు, చవటపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు వరి పంటసాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డీ హరికరుణాకర్ రెడ్డి, వీఏఏలు షేక్ సందాని, షేక్ అబీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు

రాపూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలను అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) పీడీ బీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న సూక్ష్మ సేద్య పరిక రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని సొసైటీ కార్యాలయంలో వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి జిల్లాలో 9.200 హెక్టారకు మైక్రోఇరిగేషన్ పరికరాలను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 9.824 హెకార్టర్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. 2,965 మంది రైతులకు సంబంధించి 3,169 హెక్టార్లను క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. 1,637 హెక్టార్లకు సంబంధించి 1374 మంది రైతులకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 805 హెక్టార్లకు పరికరాలు అందజేశామన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన అధికారిణి జయశ్రీ, ఎంఐడీసీ ఇన్‌చార్జి సురేష్‌జైన్, తదితరులు పాల్గొన్నారు.

షాదీమంజిలా... కమ్యూనిటీ హాలా?

మనుబోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం పక్కన నిర్మించిన భవనం షాదీమంజిలా.. కమ్యూనిటీ హాలా? మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని జనసేన సర్వేపల్లి ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆయన ఆ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ముస్లింలకోసమంటూ రూ.30లక్షల నుడా నిధులతో భవనం నిర్మించారన్నారు. అయితే శిలాఫలకంలో కమ్యూనిటీ హాలుగా నమోదు చేశారన్నారు. షాదీ మంజిల్‌ను ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్మించడంతో అందులో ఎలాంటి వేడుకలు చేసుకోలేకపోతున్నామని ముస్లింలు బాధపడుతున్నారన్నారు. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మైనార్టీల కోసం షాదీమంజిల్‌ను ఏర్పాటు చేయించాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, నాయకులు జాకీర్, ఖాదర్‌వల్లీ, మహేష్, కంటే సుధాకర్, ఆనంద్, కంటే శ్రీలక్ష్మి, భవాని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తి రోడ్డును ఆధునీకరించండి

నెల్లూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కనీసం ప్రయాణం కూడా చేయలేని దుస్థితికి చేరిన నెల్లూరు - తాటిపర్తి రహదారిని వెంటనే ఆధునీకరించాలని కోరుతూ సీపీఎం నాయకులు నెల్లూరులోని ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ గంగాధరంకు మంగళవారం వినతి పత్రం అందచేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ రోడ్డును ఆధునీకరించే క్రమంలో కొన్ని నెలల క్రితం కంకర తోలి ఒక లేయర్ వేసి వదిలేశారని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షానికి అది పూర్తిగా పాడై బైకులు కూడా వెళ్లలేని విధంగా తయారైందని చెప్పారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, రమణయ్య, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశుసంరక్షణ కేంద్రం నుంచి బాలికల పరారీ

- పట్టుకున్న తడ పోలీసులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలను తడ పోలీసులు పట్టుకున్నారు. వివిధ కేసుల్లో బాధితులుగా ఉన్న ఈ ముగ్గురు నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రంలో రక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం సంరక్షణ కేంద్రం నిర్వాహకుల కళ్లుకప్పి ఈ ముగ్గురు పరారయ్యారు. వీరు నెల్లూరు నుంచి మెమూ రైలులో రాత్రి సమయంలో తడకు వచ్చారు. అక్కడ నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఆ సమయంలో సాధారణ తనిఖీలు చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వారి ప్రవర్తనపై అనుమానించిన పోలీసులు వారి వివరాలను అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ విచారించగా నెల్లూరు నుంచి పారిపోయినట్లుగా గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ కొండప్పనాయుడు నెల్లూరు సంరక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. సదరు బాలికలను నెల్లూరు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు.

సచివాలయం ఎదుట గ్రామస్థుల నిరసన

ఇందుకూరుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి శివజ్యోతి వ్యవహారశైలిని నిరసిస్తూ మంగళవారం మండలంలోని కొరుటూరు సచివాలయం ఎదుట గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచు తుమ్మల ప్రసాద్‌యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో గ్రామ శ్మశాన వాటికలో అనేక అసాంఘిక కార్యక్రమాలు జరిగేవని, వాటిని నిర్మూలించేందుకు శ్మశాన వాటికను దాతల సహాయంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. దానికి కాపలాగా రూ.7 వేలు జీతం ఇచ్చి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి చెట్లు నాటి తాళం వేసి కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. అయితే నూతనంగా నియమితులైన పంచాయతీ కార్యదర్శి శివజ్యోతి తాళం వెయ్యవద్దని వాదనకు దిగుతుందన్నారు. తాళం వేయకపోతే అనేక అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇది గ్రామస్థులంతా కలిసి నిర్ణయం తీసుకున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పొదలకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలకు మండలంలోని అమ్మవారిపాలెం హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో సైన్స్, మ్యాథ్స్, భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశాలపై ఈనెల 6న నిర్వహించిన జిల్లాస్థాయిలో క్విజ్ పోటీల్లో అమ్మవారిపాలెం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి ఆరుగురు విద్యార్థులు షేక్.షారిన, కె.చాణక్య, ఎన్.కిషోర్, ఆర్.చరిత్, పి.ప్రియాంక, వి.పూజశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయకుమార్ మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరిరెడ్డి, సుభాషిణి, వెంకటరెడ్డి, సురేంద్రకుమార్, గౌస్, ఖాజారహంతుల్లా, రఘురామయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఉన్నతాధికారుల డుమ్మా!

- అల్లీపురంలో కానరాని ప్రత్యేకాధికారి



నెల్లూరురూరల్ : రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, నాయకులు

నెల్లూరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని అల్లీపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రత్యేకాధికారి డుమ్మా కొట్టారు. తహసీల్దారు కోర్టు వాయిదా ఉందంటూ రాకపోవడంతో డీటీ, ఆర్‌ఐ, వీఆర్వోలతో సదస్సును మమ అనిపించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సదస్సులు జరగడం లేదన్నారు. అనంతరం డీటీలకు వినతి పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య, సురేంద్ర, మేకల హరి, అజయ్‌రెడ్డి, కే వెంకటేశ్వర్లు, మణి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలి

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసిన డీఫారమ్ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామచంద్రాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రామతీర్థం పంచాయతీ వెంకటనారాయణ పురానికి చెందిన రైతులు తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. 1992లో అప్పటి ప్రభుత్వం 80 ఎకరాలకు డీ ఫారమ్ పట్టాలు అందజేసిన ఈ భూములకు రిజిస్ట్రేషన్ కావడంలేదన్నారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించాలన్నారు.

పిడూరులో...

మనుబోలు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరు సచివా లయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్య రైతు ల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకటేశ్వర్లు_రెడ్డి, టీడీపీ నాయకులు తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి, మానుగుంట సుధాకర్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనువాసులు, ఆర్‌ఐ నారాయణ, వీఆర్‌వో శ్రీనువాసులు, దేవదాయ ఈవో ఉమ పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బిట్-1 సచివాలయంలో మంగళవారం తహసీల్దారు పీ లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి భూపతి, జయమ్మ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి చొరవతో కాలువల్లో పూడికతీత



కాలువలో పారుతున్న నీటిలో గురివిందపూడి రైతులు

మనుబోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చొరవతోనే సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేయడంతో కాలువల్లో సాగునీరు సజావుగా పారుతుందని గురివిందపూడి టీడీపీ నాయకుడు చెన్నూరు సుధీర్‌రెడ్డి అన్నారు. గురివిందపూడి చెరువుకు నీరుపారే కాలువ వద్ద ఆయన రైతులతో కలిసి మంగళవారం మాట్లాడుతూ 2కి.మీ మేర చెరువుకు సాగునీరందించే కాలువను ఇటీవల బాగు చేశారన్నారు. గతంలో కాలువల గురించి పట్టించుకోలేదన్నారు. గుర్రపుడెక్క ఉండే కాలువ ఇడంపల్లి చెరువుకు వెళతుందని, అక్కడ నుంచి సముద్రం నీరు పారుతుందన్నారు. వాస్తవాలు తెలుసుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ, ఎం.ప్రసాద్, పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో కృష్ణచైతన్య క్రీడా పోటీలు



పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు మొదలయ్యాయి. వీటిని ఆ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, కారమ్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్లు రామాంజనేయులు రెడ్డి, సుధారాణి, రాంగోపాల్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ పౌరుల బాధ్యత

- ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులను కాపాడడం పౌరుల నైతిక బాధ్యత అని ఆర్‌ఐ వో డాక్టర్ ఏ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మా హక్కులు-మా భవిష్యత్ అన్న నినాదంతో ఈ ఏడాది మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుతున్నారని చెప్పా రు. కులమతాలకు అతీతంగా అందరూ జీవించే హక్కు, చదువుకునే హక్కు, భావ వ్యక్తీకరణ హక్కు, బానిసత్వాన్ని ఎదిరించే హక్కు పౌరులం దరికీ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధే లక్ష్యం : ఎంపీడీవో

నెల్లూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, నిరుపేదలకు మెరుగైన జీవనోపాధే లక్ష్యంగా పని చేయాలని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎల్ఎస్‌డీజీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. డీఎల్‌డీవో రమణయ్యతో కలిసి ఎంపీడీవో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న ఆర్థిక చేయూతను పేదలకు దగ్గర చేసి వారి జీవన స్థాయి మెరుగునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రోజ్‌మేరి, మండల అధికారులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో రక్తదాన శిబిరం

వెంకటాచలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీలో మంగళవారం జాతీయ సేవా పథకం యూనిట్-4 ఆధ్వర్యంలో నారాయణ మెడికల్ కళాశాల, హాస్పిటల్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ఎస్ఎస్ఎస్ పీవో వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాగబాబుకు పదవిపై జనసేన సంబరాలు


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించటంతో మంగళవారం నగరంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఆధ్వర్యంలో కేకులు కట్‌చేసి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు రెడ్డి, నాగరత్నం, షేక్ ఆలియా తదితరులు పాల్గొన్నారు.

- జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. నాయకులు జమీర్, కే వెంకటేశ్వర్లు, గునుకుల కిషోర్, శేఖర్‌రెడ్డి, శ్రీరామ్, సుజయ్‌బాబు, నాగరత్నం యాదవ్, కృష్ణారెడ్డి, రవి పాల్గొన్నారు.
- నాగబాబుకు అంతా మంచి జరగాలని కోరుతూ వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నాయకులు పూజలు చేశారు.

రాజరాజేశ్వరి ఆలయ చైర్మన్ రత్నం జయరామ్ కన్నుమూత



నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ చైర్మన్ రత్నం జయరామ్ (78) మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. గుండెజబ్బుతో బాధపడుతూ స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన రాజరాజేశ్వరి ఆలయ వ్యవస్థాపకుడు రత్నం మొదిలియార్ ప్రథమ సంతానం. పీ డబ్ల్యూడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం 2006 నుంచి ఆలయం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, జయరామ్ మృతికి దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, రాజరాజేశ్వరి ఆలయ ఈవో కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది తీవ్ర సంతాపం తెలి పారు. రత్నం జయరామ్ మృతికి సంతాప సూచకంగా బుధవారం మధ్యాహ్నం వరకు రాజరాజేశ్వరి ఆలయం మూసివేస్తున్నట్లు ప్రకటించారు.



పర్యాటకంలో తిరుపతికి ప్రాధాన్యం





తిరుపతి కేంద్రంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి

యాంకర్ హబ్ కింద తిరుపతి కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏ మూల నుంచైనా సులువుగా జిల్లాలోని పర్యాటక గమ్య స్థానాలను చేరుకునేలా రోడ్డు, రైలు, విమాన ప్రయాణాలకు వీలు కల్పించనుంది. సామాన్య యాత్రికులను దృష్టిలో వుంచుకుని షటిల్ బస్సులు, రెంటల్ బైక్‌లు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పర్యాటక గమ్యస్థానాలు చేరే క్రమంలో మార్గాల వెంబడీ పార్కింగ్ లాట్స్, పరిశుభ్రమైన రెస్ట్ రూమ్స్, తాగునీరు, స్పష్టమైన సూచిక బోర్డులు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద హైవే నిర్మాణాలు, హోటళ్లు, ఆధునిక రవాణా సదుపాయాలు వంటివి కల్పించనుంది. మరోవైపు పర్యాటక రంగం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఆసక్తి ఉన్న యువతకు ఆతిథ్య రంగంలోనూ, హస్త కళలలోనూ, టూర్ ఆపరేషన్లలో శిక్షణ ఇవ్వనుంది.

● 2024-29 టూరిజం పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

పర్యాటకంలో జిల్లాకు, తిరుపతి నగరానికి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలానికిగాను (2024-29) మంగళవారం ఏపీ టూరిజం పాలసీని విడుదల చేసింది. రాష్ట్రంలో గుర్తించిన ఏడు యాంకర్ హబ్‌లలో తిరుపతికీ చోటు కల్పించారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్, సీ ప్లేన్ డెస్టినేషన్లలోనూ చోటు దక్కించుకుంది. కలంకారీ చిత్రకళకు, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. కాకుంటే, టెంపుల్ సర్క్యూట్‌లలో శ్రీకాళహస్తికి, బీచ్.. ఎకో టూరిజం సర్క్యూట్లలో జిల్లాకు మొండిచేయి చూపించింది. ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నూతన టూరిజం పాలసీలో రాష్ట్రంలో ఏడు యాంకర్ హబ్‌లను ప్రభుత్వం గుర్తించింది. ఈ జాబితాలో విశాఖపట్నం, అరకులోయ, శ్రీశైలం, గండికోట, రాజమహేంద్రవరం, అమరావతితో పాటు తిరుపతికీ చోటు లభించింది. వీటిలో తిరుపతి, అరకులోయ ప్రాంతాలను స్వల్ప, మధ్యకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాను ప్రధాన పర్యాటక గమ్యస్థానాలుగా గుర్తించిన ప్రభుత్వం ఇక్కడ ఒకే రంగానికి పరిమితం కాకుండా యాత్రికులకు వైవిధ్యభరిత అనుభవాన్నిచ్చేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు మైస్ టూరిజం (మీటింగ్స్ ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్) పరంగానూ తిరుపతిని అభివృద్ధి పరచాలని నిర్ణయించింది.

టెంపుల్ సర్క్యూట్.. సీ ప్లేన్ డెస్టినేషన్లలో స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన పది టెంపుల్ టూరిజం సర్క్యూట్లలో తిరుపతికి స్థానం లభించింది. తద్వారా ఈ ప్రాంతంలోని పేరుమోసిన ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. ముఖ్యంగా ఆలయాలున్న ప్రాంతాల అభివృద్ధికి డీటైల్డ్ మాస్టర్ ప్లాన్ రూపొందించనుంది. ఏడాది పొడవునా ఆయా ప్రాంతాల్లో ఉత్సవాలు, వేడుకలు నిర్వహించేందుకు వీలుగా క్యాలెండర్ రూపొందించనుంది. దీనివల్ల ఆ ప్రాంత ప్రత్యేకత రాష్ట్ర వ్యాప్తంగా తెలిసే అవకాశముంది. ఆయా ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలనూ రూపొందించనుంది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా సీ ప్లేన్ డెస్టినేషన్లుగా ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది ప్రదేశాల్లో తిరుపతి కూడా ఉండటం విశేషం. అయితే విశాఖపట్నం, కాకినాడ వంటి చోట్ల నుంచీ సీ ప్లేన్ సర్వీసులను జిల్లాలో ఎక్కడికి నడపతారనే దానిపై పాలసీలో స్పష్టత ఇవ్వలేదు.



కలంకారీ సావనీర్ షాపులు

హస్త కళలకు ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా సావనీర్ షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ టూరిజం కింద వర్క్ షాపులు, ఎగ్జిబిషన్లు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హస్త కళల జాబితాలో శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ పెయింటింగ్స్‌కు చోటు దక్కింది. ఇప్పటికే ప్రాచుర్యం కలిగిన కలంకారీ చిత్రకళకు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ప్రచారాన్ని తెచ్చి పెట్టనుంది.

కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రాధాన్యం

పర్యాటక విధానంలో ఫుడ్ ఫెస్టివల్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలు, వంటలను అందరికీ పరిచయం చేయనుంది. ఆ బాధ్యతను తిరుపతిలోని కేంద్ర పర్యాటక శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌పై పెట్టాలని భావిస్తోంది. వీటి ద్వారా ఏడాది పొడవునా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం, వేర్వేరు స్థాయిల హోటళ్ల నడుమ పోటీలు నిర్వహించడం, విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఆసక్తి కలిగిన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనుంది.



టెంపుల్ సర్క్యూట్లలో శ్రీకాళహస్తికి దక్కని చోటు



కాగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పది టెంపుల్ సర్క్యూట్లను ఎంపిక చేయగా అందులో పేరు ప్రఖ్యాతులున్న శ్రీకాళహస్తి లేకపోవడం గమనార్హం. పొరుగునే వున్న చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయానికి జాబితాలో స్థానం దక్కగా అంతకంటే పేరున్న శ్రీకాళహస్తిని మాత్రం పర్యాటక శాఖ విస్మరించింది. శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయంతో పాటు చుట్టుపక్కల అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆలయాలు అనేకం వున్నాయి. అయినా జాబితాలో ముక్కంటి క్షేత్రం లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.


బీచ్ టూరిజం సర్క్యూట్లలో మొండిచేయి

బీచ్ సర్క్యూట్లుగా శ్రీకాకుళం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, నెల్లూరును మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. 90 కిలోమీటర్ల మేర సముద్ర తీరాన్ని కలిగిన జిల్లాకు మాత్రం అవకాశం దక్కలేదు. జిల్లాలో వాకాడు, చిల్లకూరు, కోట, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాలు సముద్ర తీరాన్ని, పులికాట్ సరస్సు తీరాన్ని కలిగి ఉన్నాయి. తూపిలిపాలెం బీచ్ ఇప్పటికే రోజువారీ పెద్దసంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. తూపిలిపాలెం, శ్రీనివాస సత్రం బీచ్‌లను అభివృద్ధిపరిస్తే పర్యాటకంగా జిల్లాకు గుర్తింపుతో పాటు ఆదాయం కూడా పెరుగుతుంది. పాలసీలో దీన్ని విస్మరించారు.



ఎకో టూరిజంలోనూ అంతే

శ్రీకాకుళం-విశాఖ, తూర్పుగోదావరి-గుంటూరు, కర్నూలు-నెల్లూరు.. ఈ మూడు జిల్లాలు మాత్రమే ఎకో టూరిజం సర్క్యూట్లుగా ఎంపికయ్యాయి. ఈ జాబితాలోనూ జిల్లాకు మొండి చేయి చూపించింది. వాస్తవానికి శేషాచల పర్వతాలు, వెలిగొండ పర్వతాలు, అడవులతో కూడిన జిల్లాలో ఎకో టూరిజంపరంగా తలకోన, సదాశివకోన, కైలాసకోన, ఉబ్బల మడుగు, మామండూరు వంటి అనేక ప్రదేశాలు పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. వీటిని ఎకో టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి గణనీయ అవకాశాలున్నాయి.



సార్.. నిధులు కావాలి!

● అత్యవసర.. అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసిన యంత్రాంగం
● విజయవాడలో నేడు, రేపు కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అనేక ఇతర అంశాలపై జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం ఎదుట ప్రతిపాదనలు ఉంచబోతోంది. నేడు, రేపు విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో వీటిని ప్రస్తావించనుంది. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తాను తయారు చేసుకున్న ప్రతిపాదనల జాబితాతో విజయవాడ బయలుదేరి వెళ్లారు. సీఎం ఎదుట కలెక్టర్ ప్రస్తావించనున్న అంశాలకు సంబంధించి ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

■ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రూ. 8 కోట్లు



నేలపట్టు పక్షుల అభయారణ్యం కేంద్రంగా దొరవారిసత్రంలో ఫ్లెమింగ్ ఫెస్టివల్ ఏటా జనవరిలో జరిగేది. దీనికి రాష్ట్ర నలుమూలల నుంచీ పర్యాటకులు, ప్రకృతి.. పక్షి ప్రేమికులు తరలివచ్చేవారు. గత ప్రభుత్వం ఈ ఉత్సవ నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో నిధులు రాక ఫ్లెమింగో ఫెస్టివల్ ఆగిపోయింది. తాజాగా దీనిపై దృష్టి పెట్టిన కలెక్టర్ వచ్చే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు రూ.8 కోట్లు కేటాయించాలని యంత్రాంగం ప్రతిపాదించింది.

కేంద్ర ప్రాజెక్టులపైనా సీఎంకు నివేదిక

వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, సాగరమాల ప్రాజెక్టు, పీలేరు-తిరుపతి ఫోర్ లేన్ రోడ్డు, రేణిగుంట-చెన్నై ఫోర్ లేన్ రోడ్డు వంటి ప్రాజెక్టుల పనులు జరుగుతున్న తీరును సీఎంకు వివరించనున్నారు. వేగంగా పూర్తి చేయడం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని అభ్యర్థించనున్నారు.

పరిశ్రమల కోసం 7 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్

జిల్లాకు వరంగా మారిన చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, కృష్ణపట్నం పోర్టు, సాగరమాల వంటి ప్రాజెక్టులను అనుకూలంగా మార్చుకుని పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని యంత్రాంగం భావిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు కీలకమైన భూముల విషయంలో ఇప్పటికే 7 వేల ఎకరాలను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసింది. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు పరిశ్రమలను కేటాయించాలని కలెక్టర్ కోరనున్నారు.

దెబ్బతిన్న రోడ్లకు రూ.900 కోట్లు

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రహదారుల నిర్వహణను విస్మరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారుల మొదలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, చివరకు గ్రామీణ రోడ్లూ దారుణంగా దెబ్బతిన్నాయి. కనీసం గోతులనూ పూడ్చలేదు. భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల నదులు, వాగులపై వంతెనలు కూలిపోయాయి. వాటిని ఇప్పటి వరకూ పునరుద్ధరించలేదు. వీటికి తొలి ప్రాధాన్యమిచ్చిన కలెక్టర్.. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల నుంచీ సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయించారు. ఆ ప్రకారం దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి రూ.900 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ నిధులను కేటాయించాలని కోరనున్నారు.

బాలాజీ, ఆల్తూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణం అవసరం

జిల్లాకు సాగునీరు తెచ్చే ఏ ప్రాజెక్టులైనా నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయి. ఉదాహరణకు కండలేరు నుంచే తెలుగు గంగ, స్వర్ణముఖి-సోమశిల కాలువల ద్వారా సాగునీరు జిల్లాకు వస్తోంది. తిరుపతి, తిరుమల ప్రజలు, యాత్రికుల తాగునీటి అవసరాలకూ కండలేరు రిజర్వాయర్‌పై ఆధారపడాల్సి వస్తోంది. అందుకనే రేణిగుంట మండలంలో శేషాచల పర్వత పాద భాగంలో ప్రతిపాదిత బాలాజీ.. డక్కిలి మండలంలో ప్రతిపాదిత ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను తక్షణం నిర్మించాల్సిన అవసరముందని యంత్రాంగం భావిస్తోంది. ఇరిగేషన్ శాఖ రూపొందించిన అంచనాలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

కుక్కను చంపిన కేసులో ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుక్కను చంపిన కేసులో ఇద్దరు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. శంకర కాలనీలో ఉంటున్న లావణ్య ల్యాబ్ క్రాస్ బ్రీడ్ పెంపుడు కుక్కను మూడేళ్లుగా పెంచుకుంటున్నారు. ఈ నెల ఆరో తేదీన సొంత పనిమీద బయటకు వెళుతూ ఆమె స్కావెంజర్స్ కాలనీలోని తన మేనమామ ఆనందయ్య ఇంటి వద్ద పెంపుడు కుక్కను, కుమార్తె గ్రీష్మను వదలి వెళ్లారు. అదే రోజు సాయంత్రం స్కావెంజర్స్ కాలనీలోని శివకుమార్, అతడి సోదరుడు సాయికుమార్ కుక్క దాడి చేసిందన్న ఆగ్రహంతో ఎలాగైనా దానిని చంపేయాలని భావించారు. రెండడుగుల చెక్క పిడి కత్తితో కుక్క గొంతుపై నరికి చంపేశారు. ఈ విషయాన్ని కుమార్తె ఫోను చేసి చెప్పడంతో.. తిరుపతి ఈస్ట్ పోలీసులకు లావణ్య ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఆమెకు పోలీసుల నుంచి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ వ్యవహారం మీడియాలో రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన సాయికుమార్, శివకుమార్‌ను అరెస్టు చేశారు.

రెవెన్యూ సదస్సుకు 1,046 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 49 గ్రామసభలు నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అందులో రీసర్వేకు 48, 22ఏకు 15, ఇంటి స్థలాలకు 249, అసైన్‌మెంట్ ల్యాండ్‌కు 73, ఆర్‌వోఆర్‌కు 507, ఇతర విషయాలకు సంబంధించి 12 చొప్పున 1,046 అర్జీలు వచ్చాయన్నారు.

‘రోడ్డు’పైకి టీడీఆర్ అవినీతి!

● ఇంటింటికీ పది బృందాల విచారణ
● బాండ్ల విలువపై క్షుణ్ణంగా పరిశీలన
● మరోవైపు సీఐడీ దూకుడు

తిరుపతి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల అవినీతి వ్యవహారం రోడ్డుపైకి వచ్చింది. వైసీపీ హయాంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి పది ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ఇంటింటికీ వెళుతున్నాయి. రోడ్డుకు నష్టపోయిన స్థలమెంత? టీడీఆర్ బాండు విలువెంత? అన్న కోణంలో విచారిస్తున్నాయి.

ఎన్నికల వేళ మాస్టర్ ప్లాన్ రోడ్లనే ఐకాన్‌గా చూపించిన వైసీపీ పెద్దలకు టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఉచ్చు బిగుస్తోంది. కూటమి అధికారంలోకి రాగానే టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలోని వివిధ మున్సిపాల్టీలకు చెందిన పది మంది టౌన్ ప్లానింగ్ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లమని రాష్ట్ర ప్రభుత్వ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఆదేశాలు జారీ చేశారు. తిరుపతికి చేరుకున్న ఆ పది మంది అధికారుల్లో.. ఒక్కొక్కరికి ముగ్గురు చొప్పున తిరుపతి టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను కేటాయించారు. ఒక్కో బృందానికి 40 నుంచి 45 టీడీఆర్ బాండ్లను అప్పగించి రోడ్డుకు ఒకరు చొప్పున డోర్‌డోర్ పరిశీలిస్తున్నారు.

విచారణ అధికారులు వీరే

కర్నూలు మున్సిపాల్టీ ప్లానింగ్ ఆఫీసర్ (పీవో) బి.విజయభాస్కర్, ఆదోని టీపీవో బాలమద్దయ్య బృందం కొర్లగుంట-తిరుమల బైపాస్ రోడ్డు.. రాయచోటి టీపీవో లక్ష్మీనారాయణమ్మ బృందం కొర్లగుంట.. తిరుపతి డీసీపీ మహాపాత్ర, నగరి టీపీవో మూర్తి బృందం గొల్లవానిగుంట రోడ్డు, ఒంగోలు పీవో బాబూరావు, యమ్మిగనూరు టీపీవో రాజేష్ బృందం పూలవానిగుంట, గొల్లవానిగుంట, తొండమాన్ చక్రవర్తి రోడ్లు.. బాపట్ల పీవో కాలేషా, ప్రొద్దుటూరు టీపీవో చంద్రమోహన్ బృందం డీబీఆర్ రోడ్డు.. నెల్లూరు సీపీవో హిమబిందు, గూడూరు టీపీవో నాగవల్లి బృందం అక్కారంపల్లి, కొంకా చెన్నాయగుంట రోడ్డు.. ఏలూరు పీవో సుధాకర్, వుడా టీపీఏ రేవతి బృందం కొర్లగుంట.. ఆముద పీవో సత్యమూర్తి, చిత్తూరు టీపీవో సుభప్రద బృందం చింతలచేను, గంగమ్మ ఆలయ రోడ్డు.. కడప డీటీసీపీవో ఆసిఫ్, టీపీవో రత్నరాజు బృందం కొర్లగుంట ప్రాంతం, గుంతకల్ ఏసీపీ శ్రీనివాసులు, పులివెందుల టీపీవో అజయ్‌కుమార్‌లు గెస్ట్‌లైన్, గ్రాండ్‌వరల్డ్ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి పరిశీలిస్తున్నారు. మరో రెండురోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన జరగనుంది. రోడ్డుకు గిఫ్ట్‌డీడ్ ఎంత ఇచ్చారు? ఇచ్చిన స్థలానికి టీడీఆర్ బాండ్లు ఎక్కువ ఇచ్చారా? బాండ్లు ఇచ్చిన చోట రోడ్డు వేశారా? వేయకపోతే ఎందుకు వేయలేదు? వంటి వివరాలను సేకరిస్తున్నారు.

సీఐడీ దూకుడు

మరోవైపు సీఐడీ అధికారులూ దూకుడు పెంచారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధిలో టీడీఆర్ బాండ్లు పొంది అనుమానంగా ఉన్న కొన్ని డోర్ నెంబర్ల జాబితాను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులకు వీరు ఇచ్చినట్టు తెలిసింది. వాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంతవేశారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో సీఐడీ వాళ్లు ఇచ్చిన జాబితాలో కొన్ని డోర్ నెంబర్లు రెవెన్యూ విభాగంలో లేనట్టు తెలుస్తోంది. ఈ వారంలో సీఐడీ దర్యాప్తు కొలిక్కిరానున్నట్టు సమాచారం.

దర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(ఆదివారం నాటిది) ద్వారా: రూ.3.77 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,124

తలనీలాలు సమర్పించిన వారు: 24,069

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏడు గంగమ్మల ఫైల్ ఫొటోలు

శ్రీకాళహస్తి స్పెషల్

ఏడు గంగమ్మల జాతర

గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో ఒక భాగం. తమను గంగమ్మతల్లి చల్లంగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. అమ్మకు అంబళ్లు పోయడమే కాకుండా వేషధారణలతో పాటు ఊరేగింపులు, పొంగళ్లతో పాటు జంతుబలులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతున్నాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ, జాతర విషయంలో శ్రీకాళహస్తికి ప్రత్యేకత ఉంది. ఇక్కడా ఒకేరోజు.. ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహిస్తారు. డిసెంబరు నెలలో.. చలికాలంలో జాతర నిర్వహించడం ఇక్కడి స్పెషాలిటీ. ఏడుగంగమ్మలైన అక్కా చెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడు గంగల పండుగ నిర్వహిస్తున్నారు. చరిత్రాత్మకంగా పరిశీలిస్తే.. జమిందారులు, సంస్థానాధీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం.. ఒకేరోజు, ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. మరెక్కడా లేని విధంగా ఒకేసారి ఏడు గంగమ్మలకు జరిగే జాతర రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీకాళహస్తిలో బుధవారం గంగజాతర వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడు గంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శనభాగ్యం కల్పించాక.. పెండ్లిమండపం వరకు ఏడుగంగమ్మలు ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా వస్తారు. అక్కడ్నుంచి ఆయా ప్రాంతాలకు అమ్మవార్లను తీసుకొస్తారు. ఉదయం 9గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి.. ఒక్కొక్కరికి వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జన కార్యక్రమం చేయడంతో జాతర ముగుస్తుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



పెండ్లిమండపం వద్ద విద్యుద్దీపాలంకరణ

అమ్మవార్లు కొలువుదీరేది ఇక్కడే

మొదటి గంగమ్మ పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మగా కొలువుదీరతారు వరసగా.. బాబుఅగ్రహారం వద్ద అంకాళమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరిగా, సన్నిధివీధిలో అంకమ్మగా, తేరువీధిలో నల్లగంగమ్మగా, జయరామరావువీధిలో కావమ్మగా, బేరివారి మండపం వద్ద ముత్యాలమ్మగా గంగమ్మలను ఆరాధిస్తారు.



గాంధీవీధిలో గంగమ్మ తెట్టురాయి

వెటర్నరీలో తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల సదస్సు

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా తిరుపతిలోని వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధన అంశాలకు సంబంధించి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. బుధ, గురువారాలు రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సులో 'పశువుల ఆరోగ్యం-ఉత్పత్తి కోసం పరిష్కారాలు' ఆవిష్కరణపై వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది పరిశోధకులు హాజరై తమ పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వెటర్నరీసైన్స్.. అప్లికేషన్లలో సాంకేతిక పురోగతి, క్లినికల్ ప్రొసీజర్స్-డిసీజ్ డయాగ్నోసిస్‌లో సాంకేతిక పురోగతి, డ్రగ్‌డిజైన్, కీమోథెరపీలో ప్రస్తుత పోకడలు, స్థిరమైన పశువుల ఉత్పత్తి, నిర్వహణ, బయోటెక్నాలజీ, స్టెమ్‌సెల్ పరిశోధనలో ప్రగతి, మల్టీ డిసిప్లినరీ రీసర్చ్.. అప్లికేషన్స్‌పై చర్చ, పరిశోధనల అంశాలపై లీడ్ పేపర్ ప్రజంటేషన్లు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథిగా చెన్నైకి చెందిన ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ ఎండీ ప్రకాశ్‌రావు, పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్, వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ తదితరులు హాజరవుతారని తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

13నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినం సందర్భంగా తమిళనాడు తిరువణ్ణామలైకి ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా తరఫున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఇంచార్జ్ డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమిళ కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందురోజున శుక్రవారం రాత్రి తిరువణ్ణామల కొండపై పవిత్ర దీపం వెలిగించనున్నారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ప్రత్యేక సర్వీసుల రవాణా ప్రారంభం కానుంది. శనివారం, ఆదివారం ఉదయం వరకు ఈ ప్రత్యేక బస్సులు సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబరు 27, 28 నుంచి బయల్దేరేలా చర్యలు తీసుకున్నారు. మొత్తం 115 బస్సులతో 232 ట్రిప్పులు తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

13న ఎడ్‌సెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన ఎడ్‌సెట్-2024 స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎస్వీయూలోని అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్టు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు, ఎడ్‌సెట్ ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావచ్చని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బాబు కోరారు.

జర్మనీలో పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

ఘన స్వాగతం పలికిన జర్మన్ వర్సిటీల ప్రతినిధులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ జర్మనీ చేరుకున్నారు. వారం రోజుల పర్యటనలో భాగంగా జర్మనీకి చేరుకున్న ఆమెకు అక్కడి యూనివర్సిటీలకు చెందిన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా వర్సిటీల ప్రతినిధులతో ఆమె సమావేశమై పద్మావతి వర్సిటీ ప్రగతిని వివరించారు. అక్కడి యూనివర్సిటీల నిర్వహణ, అభివృద్ధిని గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన, పరిశోధన, విస్తరణ, విద్యార్థులు, ఉద్యోగుల మార్పిడి అంశంలో పరస్పర సహకారంపై చర్చించారు. పరస్పర సహకారానికి జర్మనీ యూనివర్సిటీలు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 14వ తేదీకి జర్మనీ పర్యటన ముగించుకుని వీసీ ఉమ తిరుపతికి చేరుకోనున్నారు.

'ఉపాధి'లో అవకతవకలపై

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

- పనులు ఒకరికి.. బిల్లు వేరొకరి ఖాతాలోకి..
- సామాజిక తనిఖీలో వెలుగుచూసిన వైనం
- రూ.27,983 రికవరీకి ఆదేశం

తిరుపతి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని సి.గొల్లపల్లెలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్ రమాదేవిని సస్పెండ్ చేశారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,72,11,175 లతో చేపట్టిన 1,358 పనులకు సంబంధించి గతనెల 6 నుంచి 18వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ రవి ఆధ్వర్యంలో 12 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో నివేదించారు. సి.గొల్లపల్లెలో గ్రామ ఉపసర్పంచ్ చెంగారెడ్డి ఫిర్యాదు మేరకు సామాజిక తనిఖీలో కూలీల నగదు చెల్లింపుల్లో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్‌ని సస్పెండ్ చేశారు. పనిచేసిన కూలీకి కాకుండా వేరొక వ్యక్తి ఖాతాకి రూ.27,983 నగదు చెల్లించిన విషయం నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రూ. 27,983 రికవరీకి ఆదేశించారు. సి.మల్లవరం పంచాయతీలో చేపట్టిన సిమెంటు రోడ్డుపనుల్లో గుత్తేదారుడికి చెల్లించాల్సిన రూ.87,728 నగదు పీఆర్‌ఏఈ ఖాతాలో జమయ్యింది. దీన్ని పీఆర్ ఏఈ నుంచి తిరిగి గుత్తేదారుకి చెక్కురూపంలో అందజేశారు. అలాగే బ్రాహ్మణపట్టు, ఇతర పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో కొలతల తేడాకి సంబంధించి తనిఖీలో రూ.2,28,517కి ఎస్‌ఆర్‌పీ వివరణ కోరారు. దీనిపై ఏపీవో మమతారాణి మాట్లాడుతూ వర్షాలతో పనులు పూర్తిచేయలేకపోయామని వివరించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీవీ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్న పొరపాట్లు జరగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.శివయ్య, ఎంపీపీ వేముల యశోద, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, చంద్రగిరి క్లస్టర్ ఏపీడీ రెడ్డెప్ప, ఏపీవో టి.మమతారాణి, కె.రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటేరులో ఆక్రమణదారుల బరితెగింపు

- చీకటి పడ్డాక నిర్మాణ పనులు
- అడ్డుకున్న వీఆర్వోలపై దాడికి యత్నం





చీకటిలో చేపట్టిన నిర్మాణ పనులు - స్వర్ణముఖినదీపోరంబోకులో నిర్మాణం

తిరుపతిరూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం.. నగరానికి అతిసమీపంలోని ఓటేరులో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. అవిలాల లెక్కదాఖలా ఓటేరు పంచాయతీలోని సర్వేనంబరు362కి చెందిన స్వర్ణముఖినదిపోరంబోకులో చీకటిపడ్డాక నిర్మాణపనులు చేపడుతున్నారు. ఎవరైనా అడ్డుకుంటే తిరగబడేందుకు ఆకతాయిలను వెంటబెట్టుకుంటున్నారు. నిర్మాణ పనులకు మహిళా కూలీలని వినియోగించుకుంటున్నారు. వీరైతే అధికారులు ముందుకురావడానికి ధైర్యంచేయరన్న ఆలోచనతో ఈ పనిచేస్తున్నట్లు తెలిసింది. సిమెంటరాయి, ఇసుకని తరలించారక్కడికి. రాత్రివేల పనులు చేపట్టారు. ఈ విషయం సోమవారం సాయంత్రం 7గంటలకు రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కి సమాచారం అందింది ఆయన ఆదేశాలతో వీఆర్వోలు అక్కడికి వెళ్లేసరికి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో పనులు చేపట్టడంపై వీరు నిలదీశారు.పునాది వరకు ఏర్పాటు చేసిన సిమెంట్‌రాయిని కొంతవరకు తొలగించారు. కూలీల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారుడు 30మందికిపైగా ఆకతాయిలని తీసుకొచ్చి వీఆర్వోలపై దౌర్జన్యానికి దిగాడు. ఎలా తొలగిస్తారంటూ దాడికి యత్నించినట్లు తెలిసింది. మత్తులో ఉన్న ఆకతాయిలో కొందరు చిన్నపాటి ఆయుధాలు కూడా తీసుకొచ్చారని సమాచారం. దీంతో వీఆర్వోలు భయాందోళనకు గురయ్యారు.ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఆక్రమణల తొలగింపు సమయంలో పోలీసులని వెంటపంపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్‌తోనూ చర్చించారని తెలిసింది. కాగా, ఇదే స్థలానికి కొంత ముందుగా సర్వేనంబరు 360లో స్వర్ణముఖినదిపోరంబోకు స్థలంలో ఇటీవల ఆక్రమణదారులు రెండు రేకులషెడ్డులతో నిర్మాణం చేపట్టారు. ఆకతాయిలను పక్కన పెట్టుకుని ఈ పనులు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.



మంగళవారం సాయంత్రం పొగమంచు కమ్మిన వేళ.. తిరుపతిలోని మంగళం రోడ్డు నుంచి లీలామహల్ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కనిపించిన దృశ్యం.

తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

కడప కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరకుండా, ఉద్యోగ నిబంధనలు ఉల్లంఘించి ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతారు చేసిన హసీల్దారు యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాధారణ బదిలీల్లో భాగంగా యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని కేఆర్‌ఆర్‌సీ తహశీల్దారుగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయన వచ్చి చేరలేదు. వెంటనే విధుల్లో చేరాలని ఫోన్ ద్వారా చెప్పడమే కాకుండా కలెక్టర్ మెమో కూడా జారీ చేశారు. అయినా విధుల్లో చేరలేదు. దీంతో తహసీల్దారు దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

శిశుసంరక్షణ కేంద్రం నుంచి పరారైన బాలికలను పట్టుకున్న పోలీసులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలను తడ పోలీసులు పట్టుకున్నారు. వివిధ కేసుల్లో బాధితులుగా ఉన్న ఈ ముగ్గురు నెల్లూరు బాలిక శిశుసంరక్షణ కేంద్రంలో రక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం సంరక్షణ కేంద్రం నిర్వాహకుల కళ్లుకప్పి ఈ ముగ్గురు పరారయ్యారు.వీరు నెల్లూరు నుంచి మెమో రైలులో రాత్రి సమయంలో తడకు వచ్చారు. అక్కడ నుంచి బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఆ సమయంలో సాధారణ తనిఖీలు చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వారి ప్రవర్తనపై అనుమానంచిన పోలీసులు వారి వివరాలను అడగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ విచారించగా నెల్లూరు నుంచి పారిపోయినట్లుగా గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ కొండప్పనాయుడు నెల్లూరు సంరక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. సదరు బాలికలను నెల్లూరు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు.

టీటీడీ ఉద్యోగులందరికీ నేమ్‌బ్యాడ్జీ

- ఫేస్‌బుక్ ఖాతాలో టీటీడీ చైర్మన్ వెల్లడి

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలో నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నానని ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి వెల్లడించారు. కొందరు ఉద్యోగులు భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలకు వెనకాడబోనని ఆ పోస్టులో స్పష్టంచేశారు. నేమ్‌బ్యాడ్జీ ఏర్పాటుతో భక్తులతో అమర్యాదగా వ్యవహరించిన వారిని సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో బాధ్యతాయుతంగా.. అంకితభావంతో ఉద్యోగులు ప్రవర్తించేందుకు ఈ బ్యాడ్జీ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో అర్ధ వార్షిక పరీక్షలు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్ మోడల్ పేపర్ (ఎస్ఏటీఎంపీ) టర్మ్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తెలిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఎంబీయూలో ఫీజుల దోపిడీ: ఏఐఎస్ఎఫ్

తిరుపతి(జీవకోన), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఎంబీయూలో ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ఏటా అధికంగా రూ.20వేల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై గతంలో ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఫీజుల విషయంపై ప్రశ్నిస్తే ఏఐఎస్ఎఫ్ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై మంచు మనోజ్ ఇచ్చిన వివరణపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ కమిటీతో విచారణ చేయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే తల్లిదండ్రులను కలుపుకొని తాము ఎంబీయూ విశ్వవిద్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం రంగంపేటలోని కళాశాల వద్దకు వెళ్లిన జర్నలిస్టులపై బౌన్సర్లు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

28న టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈనెల 28వ తేదీన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఈ బోర్డుకు ఇది రెండో సమావేశం కావడంతో కొన్ని కీలకఅంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

సీఎంను కలిసిన టీటీడీ అదనపు ఈవో



తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం సీఎం చంద్రబాబును విజయవాడలో కలిశారు. నాలుగు నెలల్లో తిరుమలలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించిన సౌకర్యాలు, చేసిన మార్పులు, చేర్పులను వివరించారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. అన్నప్రసాదాలు, లడ్డూల నాణ్యత పెంపుపై మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, తిరుపతి పవిత్రతను కాపాడేలా వ్యవహరించాలని సీఎం సూచించారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కార్మికుల అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎస్‌డబ్ల్యూ సంఘాన్ని బలహీనపరిచేందుకు యూనియన్‌కు చెందిన డ్రైవర్లు, కండక్టర్లను అక్రమంగా సస్పెండ్ చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఆరు రోజులుగా సీఐటీయూ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేఎస్ వాసులు, రాము, కృష్ణ, రఘురాం, సుబ్రహ్మణ్యం, శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, ముత్యాలయ్య, చంద్రయ్య, శంకరయ్య మధు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

నాయుడుపేట టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సంయుక్త అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవనంలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పొదుపు మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, వారి స్వేచ్ఛకు భంగం కల్పించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. అలాగే కొనుగోలు చేసే వస్తువుల్లో నాణ్యత లోపించినా, సకాలంలో సేవలు అందించకున్నా నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పసల చెంగయ్య, రఫీ, సుమన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే



ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, ఉపాధ్యాయులు

నాయుడుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, ఎటువంటి తారతమ్యాలు ఉండవని గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రూత్‌రమోలా అన్నారు. నాయుడుపేట మండలం పుదూరులోని బాలికల గురుకులంలో మంగళవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణవతి, సుధా, శశికళ, పద్మజ, గీత, సావిత్రి, శ్రీదేవి, లక్ష్మీ, భవానీ, జాన్సీ పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలి



పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఎంఈవో, పక్కన హెచ్‌ఎం

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలతో పాటు అత్యధిక గ్రేడ్‌లతో టాపర్స్‌గా నిలవాలని ఎంఈవో దారా మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీలు చేశారు. విద్యార్థులకు కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎంఈవో మస్తానయ్యతో పాటు హెచ్‌ఎం సోఫియా కిరణ్మయి పదో తరగతి విద్యార్థులకు పలు సబ్జెక్టులను బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పబ్లిక్ పరీక్షలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వృద్ధులకు అన్నదానం



గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాలెంలోని నిరాశ్రయుల అతిథి గృహంలోని వృద్ధులకు మైఫ్రెండ్స్ అసోసియేషన్ సహకారంతో సునీత దాతృత్వంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాబురావు, కల్యాణ్, రాహుల్, కలీం, రమేష్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని బిలాస్‌పూర్‌లో ఈనెల 19తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు తిరుపతిలోని మంగళం జడ్పీ ట్రెండ్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో గెలుపొందిన జట్టులో ఈ ముగ్గురు చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. మంగళవారం పాఠశాలలో ఆ ముగ్గురుని ప్రధానోపాధ్యాయుడు కేశవులనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, సాంబశివరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని అనంతసాగరానికి చెందిన దాసరి శ్రీనివాసులు(52) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... అనంతసాగరానికి చెందిన శ్రీనివాసరావు సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం జాతీయ రహదారి నుంచి వట్రపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు



గాయపడ్డ చెంగల్‌రాయులు

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక మునిరెడ్డి కాలనీకి చెందిన చెంగల్‌రాయులు మంగళవారం ఉదయం బోడిలింగాలపాడు వద్ద ఉన్న శివాలయానికి బైక్‌పై బయలుదేరాడు. బోడిలింగాలపాడు వద్ద మలుపు తిరుగుతుండగా మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంగల్‌రాయులుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.





పాతబస్టాండ్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు - ఆటోలో వెనక భాగంలో ప్రయాణం

పల్లెబాట పట్టని ఆర్టీసీ..!

ఆటోలు, మాక్సీ క్యాబ్‌లను ఆశ్రయిస్తున్న గ్రామీణులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి డిపో పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సులు గ్రామాలకు దూరమవుతున్నాయి. నష్టాలను సాకుగా చూపుతూ... ఆటోలపై నెపం నెట్టి గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంకటగిరి డిపో పరిధిలో మొత్తం 63 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో పల్లె వెలుగు బస్సులు నామమాత్రంగా ఉన్నాయి. వెంకటగిరి నుంచి జీకే పల్లి, చిన్నపురెడ్డిపల్లి, చినన్నపేట గ్రామాల మీదుగా మాత్రమే శ్రీకాళహస్తికి పల్లెవెలుగు బస్సు నడుపుతున్నారు. మిగిలిన గ్రామీణ మార్గాల్లో ఎక్కడా బస్సు సౌకర్యం లేదు. నష్టాల్లో ఆర్టీసీని ఆదుకునేందుకు గత ప్రభుత్వంలో విలీనం చేసినట్లు ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో ఆర్టీసీ నష్టాల నుంచి బయటపడి గ్రామాలకు బస్సు సౌకర్యం మెరుగు పడుతుందని ప్రజలు ఆశించారు. అయితే ఇందుకు విరుద్ధంగా నష్టాలను సాకుగా చూపి బస్సు చార్జీలు పెంచి ప్రజలపై అదనంగా భారం మోపారు. అంతేకాకుండా ఆయా మార్గాల్లో ఆదాయం రావడం లేదని, డిపోలో అవసరమైన మేర బస్సులు లేవని, రహదారులు సక్రమంగా లేవన్న కారణాలతో సర్వీసులను నిలిపివేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు, విద్యార్థులు ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లపై ఆధారపడుతున్నారు. ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా... కిక్కిరిసిన వాహనాల్లో రాకపోకలు సాగించాల్సిన వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదాయం లేకపోవడంతోనే..

గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలు ఎక్కువగా ఉండడం, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆదరించకపోవడంతో సర్వీసులను నిలిపేశాం. తిరుపతి, నెల్లూరు రూట్‌లలో బస్సులు ఏర్పాటు చేశాం. వెంకటగిరి - కడప మధ్య బస్సు సర్వీసు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

- రామకృష్ణ, డిపో మేనేజరు

పేదల భూములను ఆక్రమిస్తే చర్యలు: పాశం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కనే సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులు

చిల్లకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదల భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల భూములకు రక్షణ కల్పించేలా ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిందన్నారు. ఎవరైనా పేద భూములను ఆక్రమిస్తే వారికి శిక్ష పడేలా, పేదల భూమును కాపాడేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-2024ను ప్రవేశపెట్టిందన్నారు. కాగా, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, సాగు చేసుకుంటున్న భూములను పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ సదస్సులో పలువురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, ర్‌ఐ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరలో 'ఫియర్' చిత్ర బృందం సందడి

గూడూరు, డిసెంబరు 10: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫియర్ చిత్రబృందం సందడి చేసింది. హీరోయిన్ వేదిక మాట్లాడుతూ తమలాంటి కొత్తవారు నటిస్తున్న కొత్త చిత్రాలను ఆదరిస్తే మరింత మంది కొత్త నటీనటులు చిత్రసీమలోకి వస్తారన్నారు. సినీ నిర్మాత, దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ ఫియర్ చిత్రం ఈనెల 14వ తేదీన విడుదల అవుతుందన్నారు. అన్ని వర్గాలను అలరించేలా నిర్మించిన ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. విద్యార్థులు చిత్ర బృందంతో సెల్ఫీలు దిగారు. చిత్ర బృంద సభ్యులు సొలోమాన్, అభి, సాహితి, కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, రాజయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరోయిన్ వేదిక



మానవ హక్కులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అనుషా

వెంకటగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జడ్జి అనుషా అన్నారు. మంగళవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలలో మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత చట్టాల్లో ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజా కుమారి, అనుపమ, రాజారావు, ఏఎస్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిశారు. మంగళ వారం అమరావతిలో రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిసి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు చేయాలని కోరారు. సూళ్లూరుపేట వేదికగా జరప తలపెట్టిన పక్షుల పండుగకు నిధులు కేటాయించి అట్టహాసంగా జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

పోలేరమ్మకు అంబళ్ల సమర్పణ



అంబళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మహిళలు

కోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గ్రామదేవతల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోలేరమ్మ జాతర జరిగింది. అమ్మవారికి బతుకు ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల నడుమ మట్టి కుండలతో చిట్టేడు పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు తప్పెట్లతో అంబళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు.

పొలం పిలుస్తోంది

గూడూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు, మిటాత్మకూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులను వాడాలన్నారు. అధికంగా రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో ప్రసన్న, దివ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కోటలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దారు జయజయరావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రైతుల భూములను కొట్టేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాన్ని సీఎం చంద్రబాబునాయుడు రద్దుచేసి రైతుల పక్షాన నిలబడ్డారని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, తెలుగు రైతు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, మోబిన్, అనిల్, సర్పంచ్ వెంకటరమణమ్మ, డిప్యూటీ తహసీల్దారు రహమతుల్లాఖాన్, ఆర్‌ఐ మధులత, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని మన్నూరు, పల్లిపాడు గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 39, పక్కా గృహాల మంజూరు కోసం 15 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వైఎస్‌ఎంపీపీ బట్టేపాటి మురళీ మోహన్ రెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ కె.తారకరామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరు సచివాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా 9మంది తమ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు రమేష్, కల్యాణి, మొబీనా, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, మారాబత్తిన గురవయ్య, గురవారెడ్డి, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలగలపొన్నూరు, సుద్దమడుగుతాగేలి గ్రామాల్లో తహసీల్దార్ ఎస్‌వీ.నరసింహారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 45 అర్జీలు వచ్చాయని, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ చినతోట గ్రామంలో తహసీల్దారు రామయ్య రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 27 వినతులు వచ్చాయని, పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఆర్‌ఐ అఖిల్, టీడీపీ నాయకులు మామిడి గోవిందయ్య, ఐయ్యల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగబాబుకు మంత్రి పదవి ప్రకటనపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న జనసేన నాయకులు

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి నాగబాబుకు రాష్ట్ర కేబినేట్‌లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమని ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మోహన్, నాగార్జున, వంశీకృష్ణ, సాయి, సనత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కాశీంగాడుకుప్పం పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవం

తడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాశీంగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రఘురామయ్య, ఉపాధ్యాయులు సుధాకర్, పద్మజారాణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

నాయుడుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలను ప్రముఖ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని 11 మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలను బలోపేతం చేయడంతో బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. తద్వారా బ్యాంక్ లింకేజీ ద్వారా వ్యాపారాలకు గరిష్ఠ రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. పొదుపు మహిళల ఉత్పత్తులను స్థానికంగా మాత్రమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానా బేగం

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానా బేగం అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు ఎవరైనా భంగం కల్పిస్తే న్యాయపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సమానత్వాన్ని పాటిస్తూ హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనారాణి, లోకనాథం, లక్ష్మీనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు కోర్టు ఆవరణలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చునన్నారు. దీని వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనా రాణి, లోకనాథం, శంకరయ్య, లక్ష్మీనారాయణ, డీఎస్పీ రమణకుమార్, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారుడికి అభినందన



లీలావికాస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారుడు బెల్లంకొండ లీలా వికాస్‌ను నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లీలావికాస్ విజయనగరంలో జరగనున్న అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ మ్యాచ్‌లో పాల్గొననున్నాడని తెలిపారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర జట్టులో అవకాశం దక్కుతుందని, లీలావికాస్ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో పద్మయ్య, పీఈటీ చైతన్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసమూర్తి

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాలభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ నెల 8వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో బాలభారతి ఉన్నత పాఠశాలకు చెందిన వై.జయదీప్, ఇ.జశ్వంత్ బంగారు పతకాలు సాధించగా వై.మోక్షదీప్ వెండి, పి. పవన్‌కల్యాణ్, ఎన్. జశ్వంత్ క్యాంస పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ కర్రా శ్రీనివాసమూర్తి, వెంకటరమణమూర్తి షీల్డ్‌లు, మెమోంటోలతో విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యానగర్‌లోని విద్యావికాష్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన హేమలత, అక్షర వెండి పతకాలు సాధించగా, ఐ.ఎస్మిత క్యాంస పతకం సాధించింది. విద్యార్థులను కరస్పాండెంట్ మధుసూదన్‌రావు, కరాటే మాస్టర్ హరిబాబు షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.